మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

ఆదివారం SUNDAY 22-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 262 Issue: 262

22 మార్చి 2026 - ఆదివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:22 సూర్యాస్తమయం - సా. 6:23 తిథి చవితి రా. 9:17 వరకు తరువాత పంచమి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం భరణి రా. 10:42 వరకు తరువాత కృతిక యోగం వైధృతి మ. 3:33 వరకు కరణం వనిజ ఉ. 10:37 వరకు విష్టి రా. 9:17 వరకు వర్జ్యం ఉ. 9:27 నుండి ఉ. 10:55 వరకు దుర్ముహూర్తం సా. 4:47 నుండి సా. 5:35 వరకు రాహుకాలం సా. 4:53 నుండి సా. 6:23 వరకు యమగండం మ. 12:23 నుండి మ. 1:53 వరకు గుళికాకాలం మ. 3:23 నుండి సా. 4:53 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:46 నుండి తె. 5:34 వరకు అమృత ఘడియలు సా. 6:42 నుండి రా. 8:11 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:59 నుండి మ. 12:47 వరకు

Published from Jagitial
Circulated to Telangana

# ప్రైవేట్ బిల్లు 'గ్యారెంటీ'

## వచ్చే శుక్రవారం సభలో బిల్లు

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. చట్టబద్ధత కల్పించాలని డిమాండ్**




తమ సీనియర్ నాయకులు, న్యాయ నిపుణులు, మాజీ అడ్వకేట్ జనరల్‌తో కూర్చొని మేమొక ప్రైవేట్ మెంబర్ బిల్లును తయారు చేశామని.. ఈ బిల్లును రాష్ట్ర శాసన సభ, శాసనమండలిలో వచ్చే శుక్రవారం ప్రవేశపెట్టబోతున్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తూ వెంటనే దీన్ని ఆమోదించాలని కోరుతూ తాము ఈ బిల్లును ప్రవేశపెట్టబోతున్నామన్నారు.

హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు): తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. 'ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కల్పిస్తే ఏం జరగుతుందని కొంతమందికి అనుమానం ఉ ఒడొచ్చు. మొన్న రేవంత్ రెడ్డి ట్రాఫిక్ చలాన్లు నేరుగా బ్యాంకు ఖాతా నుండి కట్ చేసుకుంటాము అని చెప్పినట్లు ఆరు -2 వ పేజీలో...

తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ వేసిన సరికొత్త ఎత్తుగడ ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను చట్టబద్ధం చేయాలంటూ అసెంబ్లీలో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టాలని కేసీఆర్ వ్యూహం రచించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అసెంబ్లీ వేదికగా ప్రతిపక్ష బీఆర్ఎస్ విసిరిన 'ప్రైవేట్ బిల్లు' విసిరిన సవాల్ ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీని ఆత్మరక్షణలో పడేసింది.

# కేసీఆర్ మాస్టర్ స్ట్రోక్



## ఆరు గ్యారెంటీలపై ప్రైవేట్ బిల్లు!

**అసెంబ్లీలో ప్రవేశపెట్టే ఎత్తుగడ.. అడకత్తెరలో కాంగ్రెస్ సర్కారు**

**వ్యతిరేకిస్తే మొదటికే మోసం.. ఓకే చెప్తే బీఆర్ఎస్‌కు క్రెడిట్**

హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు) ఎన్నికల హామీల అమలుపై క్షేత్రస్థాయిలో ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో, ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలనే డిమాండ్‌తో బీఆర్ఎస్ ముందుకు రావడం రాజకీయ చదరంగంలో తెలివైన ఎత్తుగడగా కనిపిస్తోంది. సాధారణంగా ప్రభుత్వం ప్రవేశపెట్టే బిల్లులపై చర్చ జరుగుతుంది. కానీ, ప్రతిపక్షం ఒక విధానపరమైన నిర్ణయంపై ప్రైవేట్ బిల్లు తెచ్చినప్పుడు అది ప్రభుత్వంపై నైతిక ఒత్తిడిని పెంచుతుంది. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని స్వయంగా ప్రకటించిన కాంగ్రెస్, ఇప్పుడు అదే అంశంపై బిల్లు వస్తే ఏం చేయాలనే సందిగ్ధంలో పడింది. ఒకవేళ కాంగ్రెస్ ఈ ప్రైవేట్ బిల్లును వ్యతిరేకిస్తే, హామీల అమలుపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు అని తరువాయి 2 వ పేజీలో...



# రాష్ట్రాలకు 20శాతం ఎక్స్‌ట్రా

**కమర్షియల్ గ్యాస్ అందించాలని కేంద్రం నిర్ణయం**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా గ్యాస్ కొరత నెలకొన్న వేళ రాష్ట్రాలకు కేంద్ర పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ లేఖ రాశారు. రాష్ట్రాలకు అదనంగా మరో 20 శాతం కమర్షియల్ గ్యాస్ అందించనున్నట్లు తెలిపారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత నేపథ్యంలో కేంద్ర సర్కారు ఈ నిర్ణయం తీసుకుంది.

న్యూఢిల్లీ: ఈ నెల 23 నుంచి అదనంగా 20 శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరా చేయనుంది కేంద్ర ప్రభుత్వం. ఇటీవల 10 శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరాను పెంచింది కేంద్రం. తాజాగా మరో సారి 20 శాతం పెంచుతూ నిర్ణయం తీసుకుంది. హోటల్స్, రెస్టా రెంట్లు, దాబాలకు గ్యాస్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్రాలకు లేఖ రాసింది. పారిశ్రామిక క్యాంటీన్లు, ఆహార ప్రాసె సింగ్/పాడి పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా స్థానిక సంస్థలతో నడిపే రాయితీ క్యాంటీన్లు/అవుట్‌లెట్లు, కమ్యూనిటీ కిచెన్‌లకు సరఫరా చూడాలని లేఖలో తరువాయి 2 వ పేజీలో...

## వలస కూలీలకు ఫ్రీగా సిలిండర్లు

## కిలో చికెన్ రూ.350

**భారీగా పెరిగిన ధరలు**

## వీఐ-బీఎస్ఎన్ఎల్ దోస్తీ!

**ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కే ప్లాన్**



# నేడు నర్మేట ఫ్యాక్టరీ ప్రారంభం

**ప్రారంభించనున్న సీఎం రేవంత్.. అన్ని ఏర్పాట్లు పూర్తి: అధికారులు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివారం సిద్దిపేట జిల్లాలో పర్యటించనున్నారు. నంగునూరు మండలం నర్మేటలో ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ఆయన చేతుల మీదుగా ప్రారంభం కానుంది. ఇప్పటికే ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో గత మూడు రోజులుగా రైతు మహోత్సవాలు జరుగుతున్నాయి.


సిద్దిపేట/హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు): రైతు మహోత్సవాలకు వివిధ జిల్లాల నుండి భారీగా రైతులు తరలివస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన 150 స్టాళ్లలో వ్యవసాయ యాంత్రీకరణ, ఆయిల్ ఫామ్ తోటల పెంపకంలో మెలుకువలు ,వ్యవసాయం తో పాటు వ్యవసాయ అనుబంధ తరువాయి 2 వ పేజీలో...



# నేడు భారీ వర్షాలు

రాష్ట్రంలో ఆదివారం పలుచోట్ల మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో గాలివేగం గంటకు 30 నుండి 40 కి.మీ వేగంతో పలు జిల్లాలలో వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు): రాష్ట్రం లోని పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములు గు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొం డ, సూర్యాపేట, మహబూబాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని పేర్కొంటూ ఆయా జిల్లాలలో -2 వ పేజీలో...



# ప్లీజ్.. హర్మూజ్ తెరవండి

## ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి

టెహ్రాన్: అమెరికా, ఇజ్రాయెల్ కలిసికట్టుగా దాడి చేస్తున్నా ఏమాత్రం వెన్నుచూపని ఇరాన్.. హర్మూజ్ విషయంలో తగ్గేదే లేదంటోంది. దీంతో ప్రపంచానికి చమురు ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ఈతరుణంలో ప్రపంచదేశాలు..హర్మూజ్ ఎప్పుడు తెరుస్తారా.. తమ ట్యాంకర్లు ఎప్పుడు వస్తాయా అని ఎదురుచూస్తున్నాయి. యుద్ధం ప్రారంభమై 22 రోజులు గడుస్తున్న సమయంలో 22 దేశాలు.. ఇరాన్ కు విజ్ఞప్తి చేశాయి.అరబ్ దేశాలపై దాడులను నిలిపివేసి, హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ, బహ్రెయిన్ సహా 22 దేశాలు ఇరాన్‌కు విజ్ఞప్తి చేశాయి. దాడులు, ప్రతిదాడులు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఇరాన్ అరబ్ దేశాల్లోని అమెరికా సదుపాయాలపై వైమానిక, డ్రోన్ దాడులు చేస్తోంది. ఈ క్రమంలో 22 దేశాలు కలిసి ఇరాన్‌కు విజ్ఞప్తి చేశాయి. మరోవైపు వాణిజ్య నౌకలు, ఇంధన మౌలిక తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,597 |
| వెండి (గ్రాము): | రూ.250 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,794 |

## విశ్వవాణి



అడవిలో దొరికే సింహదంతి మొక్క వేర్ల నుంచి తీసిన సారంతో పేగు క్యాన్సర్ కణాలు 95 శాతం నశిస్తాయని, అది కూడా 48 గంట్లలోనేనని తాజా అధ్యయనంలో తేలింది. 75 రోజుల తర్వాత అసలు విషపూరిత కణాలు కనిపించిన దాఖలాలు లేవని వెల్లడైంది.



# దేవుడి శాసనం ఇది!

**నా నిర్ణయంలో మార్పులేదు**

**మాజీమంత్రి జీవన్ రెడ్డి**

జగిత్యాల, మార్చి 21 (ఈవార్తలు): కాంగ్రెస్ పార్టీలో కొనసాగలేనన్న తన నిర్ణయంలో ఎలాంటి మార్పులేదని జగిత్యాల నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జీవన్ రెడ్డి అన్నారు. పూర్తి వివరాలు ఆదివారం తరువాయి 2 వ పేజీలో...

# నా భుజాల మీద మోసుకొస్తా




**జీవన్ రెడ్డి సాబ్ మంచి మనిషి**

**ఆయనంటే నాకు చాలా గౌరవం**

**కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్**

జగిత్యాల, మార్చి 21 (ఈవార్తలు): జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి వస్తున్నారా..? అనే విషయమై కోరుట్ల ఎమ్మెల్యే, డ్యాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలోకి వస్తానంటే.. తాను పోయి ఆయనను తన భుజాల మీద వేసుకుని వస్తానన్నారు. 'ఆయన అంత మంచి మనిషి. ఆయనంటే అంత గౌరవం నాకు. నేను సర్జన్‌గా ఉన్నప్పుడు నాకు బాగా గుర్తుంది. వాళ్ల తమ్ముడికి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. నేను ఓపీడీలోకి వెళ్తుంటే మా అందరికీ తరువాయి 2 వ పేజీలో...



# అణుకేంద్రాలే లక్ష్యం!

**నతాంజ్ అణుకేంద్రంపై ఇజ్రాయెల్ దాడి**

**తీవ్రంగా ఖండించిన ఇరాన్**

టెహ్రాన్: ఇజ్రాయెల్–అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదా డులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై మరో సారి దాడులు జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా –ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులు చేశాయని తస్నిమ్ వార్తా సంస్థ తెలిపింది. అయితే, రేడియోధార్మిక పదార్థాల లీకేజీ జరగ లేదని, పరిసర ప్రాంతాల నివాసితులకు తరువాయి 2 వ పేజీలో...

# దాడులు ఆగాలి!

## మోదీతో ఇరాన్ అధ్యక్షుడు పేజెష్కియన్

**పలు అంశాలపై ఇద్దరి ఫోన్ సంభాషణ.. బ్రిక్స్ జోక్యం చేసుకోవాలన్న మసూద్**

టెహ్రాన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పేజెష్కియన్ శనివారం ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా మసూద్ పేజెష్కియన్ మాట్లాడు తూ.. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఘర్షణకు పరిష్కారం రావాలంటే ముందుగా అమెరికా, ఇజ్రాయెల్ తమ సైనిక చర్యలను నిలిపివేయాలని చెప్పారు. అలాగే ప్రాంత స్థిరత్వం కోసం బ్రిక్స్ మరింత ముఖ్యమైన పాత్ర తరువాయి 2 వ పేజీలో...





## రాశి ఫలాలు

21.3.2026

మేషం: నిరుద్యోగులకు అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. సోదరులతో దీర్ఘకాలికంగా వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగస్తులకు శుభవార్తలు అందుతాయి. ఆస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. వృత్తి ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

వృషభం: చేపట్టిన పనులలో ఆటంకాలు ఉన్నప్పటికీ సకాలంలో పూర్తవుతాయి. మిత్రుల నుండి ఆసక్తికర విషయాలు తెలుస్తాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

మిథునం: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం వలన విశ్రాంతి లభించదు. ఇంటాబయట ఒత్తిడులు పెరుగుతాయి. వ్యాపారాలు ఆశించిన రీతిలో రాణించవు. నిరుద్యోగులకు నిరాశ తప్పదు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో మిశ్రమ ఫలితాలు అందుతాయి.

కర్కాటకం: వ్యాపార వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. కీలక వ్యవహారాలలో ఆప్తులతో మాటపట్టింపులు ఉంటాయి.చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది నిరుద్యోగుల ప్రయత్న లోపం వలన వచ్చిన అవకాశాలు చేజారుతాయి. ధన వ్యవహారాలలో కొంత అప్రమత్తంగా వ్యవహరించాలి.

సింహం: నిరుద్యోగులకు నూతన అవకాశములు అందుతాయి. గృహమున శుభకార్యములు నిర్వహిస్తారు. అవసరానికి చేతికి డబ్బు అందుతుంది. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. మిత్రులతో చర్చలు చేస్తారు. వ్యాపారాలలో నష్టాలు భర్తీ అవుతాయి. ఉద్యోగాలలో సమస్యల నుండి బయటపడతారు.

కన్య: ఆప్తుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. రావలసిన ధనం చేతికందుతుంది. కుటుంబ సమస్యలు పరిష్కార దిశగా సాగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వృత్తి , ఉద్యోగాలు ఉత్సాహంగా సాగుతాయి.

తుల: కుటుంబ సభ్యులతో దూరప్రయాణాలు చేస్తారు. ఋణదాతల ఒత్తిడి నుండి బయటపడటానికి నూతన ఋణాలు చేస్తారు. చేపట్టిన పనుల్లో స్వల్ప అవరోధాలుంటాయి. జీవిత భాగస్వామితో ఆలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలలో ధన నష్టాలుంటాయి. ఉద్యోగాలు సామాన్యంగా సాగుతాయి.

వృశ్చికం: వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరుత్సాహం కలిగిస్తాయి. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగమున అప్పగించిన బాధ్యతలు నిర్వహించడంలో విఫలమౌతారు. చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. ఆస్తి వ్యవహారాలలో వివాదాలు కలుగుతాయి.

ధనస్సు: సంఘంలో ప్రముఖుల నుండి విశేషమైన ఆదరణ లభిస్తుంది. వ్యాపారస్తులకు నూతన పెట్టుబడులు అందుతాయి. వివాదాలకు సంబందించి కీలక సమాచారం అందుతుంది. మిత్రుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. ఉద్యోగాలలో తెలివిగా సమస్యల నుండి బయటపడతారు.

మకరం: వ్యాపారాలు మరింత మందగిస్తాయి. కుటుంబ వాతావరణం చికాకు కలిగిస్తుంది. ఆకస్మిక ధనవ్యయ సూచనలున్నవి. ఉద్యోగులకు సహోద్యోగులతో మనస్పర్థలు కలుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. ఋణప్రయత్నాలు కలసిరావు.

కుంభం: ఇంటా బయట కీలక నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. నూతన ఉద్యోగ అవకాశములు అందుతాయి. వృత్తి వ్యాపారమున వ్యవహార అనుకూలత కలుగుతుంది. పాత సంఘటనలు గుర్తు చేసుకుని బాధపడతారు. ఉద్యోగమున అనుకూల మార్పులు ఉంటాయి. గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు.

మీనం: వ్యాపారాలలో తొందరపడి నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది. చేపట్టిన పనులు నిదానంగా పూర్తవుతాయి. సన్నిహితుల నుండి ఒక ముఖ్యమైన వ్యవహారంలో కీలక సమాచారం అందుతుంది. ఉద్యోగాలలో శ్రమకు తగిన ఫలితం అందదు. సంతాన విద్యా ఫలితాలు అంతంత మాత్రంగా ఉంటాయి.

# కేసీఆర్ మాస్టర్ స్ట్రోక్

మొదటి పేజీ తరువాయి

విపక్షాలు ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రమాదం ఉంది. ఇది ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలిగించవచ్చు. ఒకవేళ బిల్లుకు మద్దతు ఇస్తే, ప్రతిపక్షం ఒత్తిడి వల్లే ప్రభుత్వం దిగి వచ్చిందనే సంకేతాలు వెళ్తాయి. ఇది రాజకీయంగా బీఆర్ఎస్ సాధించిన విజయంగా మారుతుంది. పాలనలో ఆరు గ్యారెంటీల అమలుకు గడువు కావాలని కాంగ్రెస్ కోరుతుండగా, బీఆర్ఎస్ మాత్రం చట్టం చేయండి..

అమలు బాధ్యత మీదే అంటూ చెక్ పెట్టింది. ఈ ఎత్తుగడతో కాంగ్రెస్ సర్కారు అడకత్తెరలో పోకచెక్కలా మారింది. సభలో ఈ బిల్లుపై చర్చ జరిగితే, అది అధికార పక్షానికి అగ్నిపరీక్షగా మారనుంది. మొత్తానికి, 'కారు' పార్టీ వేసిన ఈ పంతం తెలంగాణ రాజకీయాల్లో ఏ మలుపు తిప్పుతుందో వేచి చూడాలి. బీఆర్ఎస్ ప్రవేశపెట్టబోయే ఈ ప్రైవేట్ బిల్లు అసెంబ్లీలో చర్చకు వస్తే, అది కేవలం ఒక బిల్లుగానే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ఒక రిఫరెండంలా మారే అవకాశం ఉంది.

సాధారణంగా ప్రైవేట్ బిల్లులు ఆమోదం పొందడం చాలా అరుదు. ప్రభుత్వం తన మెజారిటీని ఉపయోగించి, బిల్లులోని సాంకేతిక లోపాలను ఎత్తిచూపుతూ దాన్ని తిరస్కరించే అవకాశం ఉంది. గత పదేళ్లలో మీరు ఇచ్చిన హామీలు ఎన్ని నెరవేర్చారు? అంటూ బీఆర్ఎస్ పాత వైఫల్యాలను కాంగ్రెస్ తెరపైకి తెచ్చే చాన్స్ ఉంది. తద్వారా చర్చను పక్కదారి పట్టించవచ్చు. మేము ఇప్పటికే అమలు చేస్తున్నాం, చట్టం అవసరం లేదు అని చెబుతూనే, పెండింగ్‌లో ఉన్న గ్యారెంటీలపై స్పష్టమైన గడువు ప్రకటించాల్సి రావచ్చు. అయితే, ప్రజల్లో కాంగ్రెస్ తేలిపోయే ప్రమాదం ఉంది. ఈ బిల్లు ద్వారా తాము ప్రజల పక్షాన నిలబడ్డామని, ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని ప్రజల్లోకి బలంగా వెళ్లడం బీఆర్ఎస్ ప్రధాన ఉద్దేశం.

ఒకవేళ బిల్లు వీగిపోయినా, కాంగ్రెస్ భయపడింది అని ప్రచారం చేసుకోవడానికి వీరికి అవకాశం దొరుకుతుంది. సామాన్య ప్రజలు ఈ చర్చను ఆసక్తిగా గమనిస్తారు. ముఖ్యంగా రైతు భరోసా, నిరుద్యోగ భృతి వంటి హామీల చుట్టూ చర్చ తిరిగితే అది ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుంది.

# ప్రైవేట్ బిల్లు 'గ్యారెంటీ'

మొదటి పేజీ తరువాయి

గ్యారంటీలకు చట్టబద్ధత వస్తే మీకు రావాల్సిన హామీలకు సంబంధించిన అన్ని డబ్బులు నేరుగా ప్రభుత్వం నుండి మీ బ్యాంకు ఖాతాల్లో పడతాయన్నారు. మీకు కూడా రూ.2500 కోసం ఎదురుచూసే అవసరం ఉండదు. చట్టమైతే, కాంగ్రెస్, బీజేపీ సహకరిస్తే నా ప్రైవేట్ మెంబర్ బిల్లు పాసైతే.. మా రాష్ట్రంలోని ఆడబిడ్డలందరికీ సచ్చినట్టు ప్రభుత్వం రూ.2500 ఇయ్యాల్సిందే. లేకపోతే ఖాతాల నుంచి కట్ చేసుకునే ఆటోడెబిట్ సౌకర్యం తప్పకుండా మీకొస్తది. మీ ఖాతాల్లో వచ్చి పడ్తది. లేదంటే బాకీగా మిగిలిపోతది.. మీకు తప్పకుండా ప్రభుత్వానికి ఇయ్యక తప్పని పరిస్థితి వస్తది' అని తెలిపారు. రాష్ట్రంలోని పెద్ద మనుషులందరికీ రూ.4000 పెన్షన్‌కు సంబంధించి చట్ట బద్దత వస్తే మీకు హక్కు వస్తదన్నారు కేటీఆర్. 'ఆ హక్కుతో మీరు కోర్టుకు పోయి చట్టం ఉంది. వీళ్లు ఇస్తలేరు అంటే కోర్టు మొట్టికాయలు వేసి గవర్నమెంట్‌తో మిత్తితో సహా కట్టించి ఇస్తది. గది మీకు లాభమయ్యేదే. రైతులకు హక్కు వస్తది.. ఆరు గ్యారంటీ చట్టమైతే రైతులకు హక్కు వస్తది. మాకు 15000 అన్నడు.. ఇస్తలేడు. ఇప్పటికే మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. అని మీరు కోర్టుకు పోతే కోర్టు మొట్టికాయలు వేసి గవర్నమెంట్‌తోని మీకు పైసలిప్పస్తది. రాష్ట్రంలోని విద్యార్థులకు లాభమైతది. 5 లక్షల మంది విద్యార్థులకు విద్యా భరోసా కార్డు ఇయ్యక తప్పని పరిస్థితి గవర్నమెంట్‌కు ఏర్పడతది. అందుకే మేం మీ తరపున ఈ బిల్లు పెడుతున్నం. మీరు దరఖాస్తుల్లివ్వాల్సిన అవసరముండదు. దండాలు పెట్టాల్సిన పని లేదు. అయ్యా అప్పా అని ఎవరినీ బతిమిలాడుకోవాల్సిన అవసరం కూడా ఉండదు. ఎట్లైతే ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం విధిగా జీతాలిస్తదో చట్టం చేస్తే అట్లాగే రూ.4వేల పెన్షన్, మీకు రూ.2500 మహిళలకు, రూ.15 వేలు రైతులకు, 5 లక్షల విద్యా భరోసా కార్డు విద్యార్థులకు వస్తది. చట్టం ఉద్దేశం ఇది' అని వివరించారు.



## వలస కూలీలకు ఫ్రీగా సిలిండర్లు

న్యూఢిల్లీ: గ్యాస్ కొరత కష్టాలను తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ జీవిస్తున్న వలస కార్మికులకు 5 కిలోల గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేయాలని నిశ్చయించింది. ఈ నిర్ణయం అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు అధికారిక లేఖలు పంపింది. రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అర్హులైన వలస కూలీలను గుర్తించి, ఈ నెలాఖరు నుంచే సరఫరాను ప్రారంభించనున్నారు. వలస కూలీలకు 5 కిలోల సిలిండర్లు పూర్తి ఉచితంగా లభిస్తాయి. ఈ నెల 23వ తేదీ నుండి అన్ని రాష్ట్రాలకు సిలిండర్ల సరఫరా ప్రక్రియ మొదలవుతుంది. నిత్యం ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే కార్మికులకు, పెద్ద సిలిండర్లు మోయడం కష్టంగా ఉంటుంది. అందుకే 5 కిలోల చిన్న సిలిండర్లను ప్రభుత్వం ఎంచుకుంది. ఇది వారికి ఎంతో సౌకర్యవంతంగా ఉండనుంది.

## కిలో చికెన్ రూ.350

**భారీగా పెరిగిన ధరలు.. రంజాన్, ఎండలే కారణం**

హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు): చికెన్ తినేవారికి నిజంగా ఇది చేదువార్తే అని చెప్పాలి. ఎందుకంటే చికెన్ ధరలకు రెక్కలొచ్చాయి. రంజాన్ పర్వదినం సందర్భంగా చికెన్‌కు గిరాకీ ఏర్పడటంతో ధరలు పెరిగినట్లు వ్యాపారుల చెబుతున్నారు. నిన్నటి వరకూ కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ.320 వరకు ఉండగా ఈరోజు ఏకంగా రూ. 30 వరకు పెరిగింది. హైదరాబాద్ నగరంలో నేడు కిలో చికెన్ ధర రూ.340-350 మధ్య పలుకుతోంది. ఇక నాటుకోడి ధరలు అయితే భారీగా పెరిగాయి. కేజీ ధర రూ.800 వరకూ చెబుతున్నారు. ఎండల తీవ్రతకు కోళ్లు మృత్యువాత పడటంతో డిమాండ్ తగిన విధంగా సప్లయ్ లేకపోవటంతో చికెన్ ధరలు పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ప్రస్తుతం రంజాన్ మాసం కావటం, హలీల్, ఇతర వంటకాల కారణంగా చికెన్ వినియోగం పెరిగిందని అంటున్నారు. అలాగే వివాహాలు, ఇతర శుభకార్యాల సీజన్ కావడంతో చికెన్‌కు డిమాండ్ విపరీతంగా పెరిగిందని చెబుతున్నారు. రవాణా ఖర్చులు పెరగడం, కోళ్ల దానా ధరలు పెరగటం కూడా ఈ పరిస్థితికి కారణం అంటున్నారు. కేజీ చికెన్ ధరలు దాదాపు అరకిలో మటన్ రేటుకు చేరువవుతుండటంతో చాలామంది వినియోగదారులు చేపలు వంటివి కొనుగోలు చేస్తున్నారు. ఇక తెలంగాణలో మాంసాహార ప్రియుల సంఖ్యతో పాటు ఉత్పత్తి కూడా రికార్డు స్థాయిలో పెరుగుతోంది. తాజాగా రాష్ట్ర ప్రగతిని ప్రతిబింబించే 'తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక - 2026'లో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి.

## నేడు నర్మేట ఫ్యాక్టరీ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

రంగాలైన ఉద్యానవన, పాడి పరిశ్రమ, మత్స్య రంగాల ద్వారా అధిక దిగుబడి సాధించడానికి శాస్త్రవేత్తల ద్వారా మెలుకువలు నేర్చుకోవడంతో ఆధునిక వ్యవసాయాన్ని అవగాహన చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు నర్మేటలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జిల్లా కలెక్టర్,పోలీస్ కమిషనర్, అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి పర్యటనలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభించి పైలాన్ ఆవిష్కరిస్తారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శిస్తారు. తెలంగాణలో మొట్టమొదటి ఆయిల్ రిఫైనరీకి శంకుస్థాపన చేస్తారు. కాగా, సభకి వచ్చే ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రులు సూచనలు చేశారు. హెలిప్యాడ్ , సభ వేదిక , భద్రత, తాగు నీరు, ట్రాఫిక్ నిర్వహణ, వాహనాల పార్కింగ్,విద్యుత్తు, సౌండ్ సిస్టం, ఫైర్,అంబులెన్స్ తదితర వాటిపై అధికారులకు సూచనలు చేశారు.

# దాడులు ఆగాలి!

మొదటి పేజీ తరువాయి

పోషించాలని కోరారు. ఇద్దరు నేతల మధ్య టెలిఫోన్ సంభాషణలో ద్వైపాక్షిక సంబంధాలు, అలాగే ప్రాంతీయ, అంతర్జాతీయ పరిణామాలపై చర్చ జరిగినట్టు పేజెష్కియన్ పేర్కొన్నారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న సైనిక దాడులను ఆయన ప్రస్తావించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్-అమెరికా దాడులను నిలిపివేయడం, ప్రాంతీయ, గ్లోబల్ స్థిరత్వాన్ని కాపాడటం కోసం బ్రిక్స్ స్వతంత్ర పాత్ర పోషించాలని పేజెష్కియన్ కోరారు. భారతదేశం ప్రస్తుతం బ్రిక్స్‌కు అధ్యక్ష హోదాలో ఉన్న నేపథ్యంలో ఈ విషయాన్ని ఇరాన్ అధ్యక్షుడు ప్రస్తావనకు తెచ్చారు. పశ్చిమాసియా దేశాల మధ్య ప్రాంతీయ భద్రతా వ్యవస్థ ఏర్పాటును కూడా పేజెష్కియన్ ప్రతిపాదించారు. విదేశీ జోక్యం లేకుండా శాంతి, స్థిరత్వం సాధించాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ తన ప్రకటనలో బ్రిక్స్ గురించి ప్రస్తావించలేదు. అయితే, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ గత వారం ఇరాన్‌తో జరిగిన సంభాషణల్లో బ్రిక్స్ అంశం ప్రస్తావనకు వచ్చినట్టు తెలిపారు. ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీతో తాను ఇటీవల ఫోన్‌లో మాట్లాడినట్లు జైశంకర్ చెప్పారు. "ఇరాన్ విదేశాంగ మంత్రితో మరోసారి మాట్లాడాను. ద్వైపాక్షిక అంశాలు, బ్రిక్స్ సంబంధిత విషయాలపై చర్చించాం" అని తెలిపారు. ఘర్షణ తగ్గాలంటే ముందుగా అమెరికా, ఇజ్రాయెల్ దాడులు వెంటనే ఆగాలని, భవిష్యత్తులో దాడులు జరగవన్న హామీలు అవసరమని ఇరాన్ అధ్యక్షుడు పేజెష్కియన్ అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్ చర్యలను ఆయన అమానుషం, అనైతికం అని పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం ప్రారంభించలేదని, అన్యాయంగా ఇజ్రాయెల్-అమెరికా దాడులు ప్రారంభించాయని మోదీకి పేజెష్కియన్ తెలిపారు. అణు చర్చలు జరుగుతున్న సమయంలోనే ఈ దాడులు జరిగాయని అన్నారు. ఈ దాడుల్లో ఉన్నత స్థాయి నాయకులు, సైనికాధికారులు, పౌరులు మరణించారని, పాఠశాల పిల్లలు కూడా బలయ్యారని తెలిపారు. ప్రజా మౌలిక వసతులపై కూడా దాడులు జరిగినట్టు చెప్పారు. మినాబ్ ప్రాంతంలో ఒక పాఠశాలపై దాడి జరిగి 168 మంది పిల్లలు మరణించారని పేర్కొన్నారు. ఈ దాడి సమీప దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాల నుంచి జరిగినట్టు ఆరోపించారు.

## వీఐ-బీఎస్ఎన్ఎల్ దోస్తీ!

న్యూఢిల్లీ: టెలికం రంగంలో జియో, ఎయిర్‌టెల్ ఆధిపత్యం పెరుగుతున్న తరుణంలో, ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న వోడాఫోన్-ఐడియా పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించాయి. దీనిపై కేంద్ర టెలికం శాఖ కీలక ప్రకటన చేసింది. ఖర్చుల తగ్గింపులో భాగంగా, కొత్త టవర్లు ఏర్పాటు చేయడం, ఫైబర్ నెట్‌వర్క్ నిర్మించడం వంటి భారీ ఖర్చులను తగ్గించుకోవడానికి రెండు సంస్థలు తమ వద్ద ఉన్న మౌలిక సదుపాయాలను ఒకరికొకరు పంచుకోనున్నాయి. బీఎస్ఎన్ఎల్ విస్తృతమైన గ్రామీణ నెట్‌వర్క్, వోడాఫోన్-ఐడియా యొక్క పట్టణ నెట్‌వర్క్ కలిస్తే, వినియోగదారులకు మెరుగైన సిగ్నల్ మరియు డేటా సేవలు అందుతాయి. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ 4జీ రోలౌట్ దశలో ఉంది. ఈ ఒప్పందం ద్వారా వోడాఫోన్-ఐడియా మౌలిక సదుపాయాలను వాడుకుంటే 4జీ, 5జీ సేవలను మరింత వేగంగా అందుబాటులోకి తీసుకురావచ్చు. నెట్వర్క్ నాణ్యతను మెరుగుపర్చేందుకు, 5జీ విస్తరణను వేగవంతం చేసేందుకు ఈ చర్య ఉపయోగపడొచ్చని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఒకట్రెండు కంపెనీలు ఆధిపత్యం చెలాయించకుండా టెలికం మార్కెట్లో పోటీ ఉండేలా ఇది దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 4జీ సైట్స్, అప్‌గ్రేడ్స్ కోసం ఇవి భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

# దేవుడి శాసనం ఇది!

మొదటి పేజీ తరువాయి

వెల్లడిస్తానని ఆయన మీడియాతో మాట్లాడుతూ పేర్కొన్నారు. మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే సత్యం తదితరులు శనివారం జీవన్ రెడ్డిని కలిసిన విషయం తెలిసిందే. పార్టీ మారతానని ఆయన ప్రకటించిన నేపథ్యంలో మంత్రులు ఆయనను బుజ్జగించే ప్రయత్నం చేశారు. జీవన్ రెడ్డితో మంత్రులు గంటకు పైగా సమావేశమయ్యారు. అనంతరం జీవన్ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, తాను అనుకున్న తేదీలోనే భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం ప్రకటిస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా దేవుడు శాసిస్తే మానవుడు అనుసరిస్తాడని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాగా, కాంగ్రెస్ పార్టీలో తనకు ప్రాధాన్యం లేకుండా పోయిందని, కొత్తగా వచ్చిన వారిని అందలమెక్కిస్తున్నారని, అందుకే తాను పార్టీ వీడుతున్నానని జీవన్ రెడ్డి ఇటీవల ప్రకటించారు. కాగా, జీవన్ రెడ్డి అధిష్ఠానాన్ని కలవడానికి అనాసక్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈరోజు ఆయన హైదరాబాద్‌లో పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో సమావేశం కావాల్సి ఉంది. కానీ ఆయన జగిత్యాలలోనే ఉండిపోయారు. అధిష్ఠానం నుంచి జీవన్ రెడ్డికి ఎలాంటి ఫోన్ రాలేదని ఆయన వర్గం నాయకులు చెబుతున్నారు. శనివారం మంత్రులతో జరిగిన చర్చలు కూడా విఫలమైనట్లు జీవన్ రెడ్డి సంకేతాలు ఇచ్చారు.

## రాష్ట్రాలకు 20శాతం ఎక్స్‌ట్రా

మొదటి పేజీ తరువాయి

పేర్కొంది. మరోవైపు.. పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నౌకల కదలికలు, పోర్టు కార్యకలాపాలు, భారతీయ సముద్ర కార్మికుల భద్రత, సముద్ర వాణిజ్య కొనసాగింపును నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రాంతంలో ఉన్న భారతీయ సముద్ర కార్మికులు అందరూ సురక్షితంగా ఉన్నారని, గత 24 గంటల్లో భారత జెండా ఉన్న నౌకలకు సంబంధించిన ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు నమోదు కాలేదని తెలిపింది. మొత్తం 22 భారత నౌకలు, 611 భారతీయ సముద్ర కార్మికులు పశ్చిమ పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో ఉన్నారని, డీజీ షిప్పింగ్ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపింది. ం

## ప్లీజ్.. హర్మూజ్ తెరవండి

మొదటి పేజీ తరువాయి

సదుపాయాలపై దాడులను ఈ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇరాన్ చర్యలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఈ దేశాలు పేర్కొన్నాయి. హిందూ మహాసముద్రంలోని డిగో గార్సియా ద్వీపంలో ఉన్న యూఎస్-యూకే సైనిక స్థావరం లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులకు పాల్పడింది. ఈ దాడిని బ్రిటన్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ దాడులు దుస్సాహసంగా అభివర్ణించింది. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు, హర్మూజ్ జలసంధి మూసివేత వంటివి తమ ప్రయోజనాలకు, తమ మిత్రదేశాలకు ముప్పుగా బ్రిటన్ రక్షణ శాఖ తెలిపింది.

## నేడు భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి

ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. శనివారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 2 సెంటీమీట్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో 2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. రానున్న రెండు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయికంటే 2 నుండి 3 డిగ్రీల సెల్సియస్ తక్కువగా ఉండే అవకాశం ఉందని తెలిపింది. తర్వాతి నాలుగు రోజుల్లో అవి క్రమంగా 2 నుండి 4 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.

## అణుకేంద్రాలే లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి

ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొంది. ఈ దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్‌లు నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్‌ను లక్ష్యంగా చేసుకున్నాయని మండిపడింది. ఈ దాడులు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం, ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. తాము జరిపిన దాడులతో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించిన వేళ తాజా దాడులు జరగడం గమనార్హం. నతాంజ్‌పై దాడులను రష్యా సైతం తప్పుపట్టింది. వాటిని అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా రష్యా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటువంటి బాధ్యతా రాహిత్య చర్యలు.. పశ్చిమాసియా అంతటా పెను విపత్తుకు దారితీసే ముప్పును కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

## నా భుజాల మీద మోసుకొస్తా


మొదటి పేజీ తరువాయి

పక్కనే చైర్లు ఉంటాయి. ఆయన ఒక్కడే రోజు వచ్చి చేతులు కట్టుకుని వెనకాల కూర్చుంటుండే. ఎమ్మెల్యేలంటే ఎట్లుంటరు. ఎమ్మెల్యే కాదు పార్టీ ఇంచార్జ్‌లే.. జీవితంలో ఒక్కసారి కూడా గెలువనోళ్లు కూడా ఇవాళ, రేపు నాకు నలుగురు గన్‌మెన్లు కావాలంటున్నరు. అట్లాంటిది ఆయన ఒక్కరే వచ్చి ఇట్ల కూర్చుంటుండే. నాకు ఆయనంటే అంత గౌరవం. ఆయన దగ్గర అవినీతి అనే పదమే ఉండదు. అలాంటి వ్యక్తి మా పార్టీలోకి వస్తే ఆనందంగా స్వాగతిస్తా. మా జీవన్ రెడ్డి సాబ్ అంటే మాకంత గౌరవం' అని సంజయ్ పేర్కొన్నారు.

# వాట్సాప్ మెసేజ్‌తో రూ.1.2 కోట్లు దోపిడీ

**మాజీ డీజీపీ మనవరాలికి సైబర్ నేరగాళ్ల టోకరా**

హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు): హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన భారీ సైబర్ మోసం ఒకటి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రముఖ వ్యాపారవేత్త, ఓ మాజీ డీజీపీ మనవరాలైన దివ్యారెడ్డి దొడ్ల పేరుతో సైబర్ కేటుగాళ్లు ఏకంగా రూ.1.2 కోట్లు కాజేశారు. వాట్సాప్‌లో ఆమె ఫొటో, పేరును ఉపయోగించి కంపెనీ అకౌంటెంట్‌ను చాకచక్యంగా నమ్మించి ఈ భారీ మోసానికి పాల్పడ్డారు. ఈ ఘటన సైబర్ నేరాల్లో 'సీఈవో ఫ్రాడ్' లేదా 'వాట్సాప్ ఇంపర్సనేషన్ స్కామ్' ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తోంది. దొడ్ల-ప్రతాప్ గ్రూప్‌లో డైరెక్టర్‌గా, దొడ్ల డెయిరీతో సహా దాదాపు 18 కంపెనీలకు సారథ్యం వహిస్తున్న దివ్యారెడ్డికి తెలియకుండా ఈ మోసం జరిగింది. వివరాల్లోకి వెళితే, మార్చి 13న కంపెనీ అకౌంటెంట్ గుండెమెడ రఘుబాబుకు ఓ అపరిచిత నంబర్ నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది. ఆ వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్‌లో దివ్యారెడ్డి ఫొటో, పేరు ఉండటంతో అది ఆమె నుంచే వచ్చిందని ఆయన పూర్తిగా విశ్వసించారు. "తాను ఒక ముఖ్యమైన మీటింగ్‌లో ఉన్నాను, తక్షణం కొంత డబ్బు బదిలీ చేయాలి" అని ఆ సందేశంలో ఉండటంతో, రఘుబాబు ఏమాత్రం ఆలోచించకుండా కంపెనీ ఖాతా నుంచి రూ.1.2 కోట్లను నేరగాళ్లు సూచించిన 'లేబోరిస్ ఇంటీరియర్స్' అనే సంస్థ పేరుతో ఉన్న సౌత్ ఇండియన్ బ్యాంక్ ఖాతాకు బదిలీ చేసేశారు. ఈ మోసం ఇంతటితో ఆగలేదు. మార్చి 17న అదే నంబర్ నుంచి మరోసారి సందేశం వచ్చింది. ఈసారి 'ఆర్మ్ ప్లేబోర్డ్ ప్రైవేట్ లిమిటెడ్' అనే ఖాతాకు రూ.18 లక్షలు బదిలీ చేయాలని కోరారు. నిర్ధారణ కోసం రఘుబాబు ఆ సందేశాన్ని దివ్యారెడ్డికి ఫార్వార్డ్ చేశారు. అప్పుడు అసలు విషయం బయటపడింది. తాను ఎలాంటి మెసేజ్‌లు పంపలేదని దివ్యారెడ్డి చెప్పడంతో అకౌంటెంట్ షాక్‌కు గురయ్యారు. జరిగిన మోసాన్ని గ్రహించి వెంటనే అప్రమత్తమయ్యారు. బాధితురాలు దివ్యారెడ్డి వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి, ఆ తర్వాత సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు అందజేశారు. పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై ఐపీసీ, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నేరగాళ్లు ఉపయోగించిన బ్యాంక్ ఖాతాలు, డిజిటల్ ఆధారాలను ట్రేస్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఉన్నతస్థాయి వ్యక్తుల పేర్లతో జరుగుతున్న ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డబ్బు బదిలీలకు ముందు ఫోన్ ద్వారా ధృవీకరించుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు.




## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

*అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.*

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## భార్య మరణం తట్టుకోలేక ఎస్సై ఆత్మహత్య

**కరీంనగర్‌లో తీవ్ర విషాదం**

కరీంనగర్, మార్చి 21 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఇటీవల భార్య ఆత్మహత్య చేసుకోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ పోలీస్ సబ్-ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) బలవన్మరణానికి పాల్పడ్డాడు. కరీంనగర్ టూటౌన్ ఎస్సైగా పనిచేస్తున్న చంద్రశేఖర్, ఇల్లంతకుంట మండలం సీతంపేటలోని తన అత్తగారింట్లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. వివరాల్లోకి వెళితే.. సీతంపేటకు చెందిన దివ్య(30)కు, చంద్రశేఖర్‌కు 2016లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న దివ్య, ఈ నెల 18న ఇంట్లో గన్నేరు పువ్వులు, ఆకులు కలిపి మిక్సీలో వేసుకుని తాగింది. ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు ఫోన్‌లో చెప్పడంతో కుటుంబసభ్యులు ఆమెను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. అయితే, దివ్య మరణానికి చంద్రశేఖరే కారణమని ఆరోపిస్తూ ఆమె అంత్యక్రియల సమయంలో గ్రామస్తులు ఆయనపై దాడికి ప్రయత్నించారు. ఆ సమయంలో దివ్య తండ్రే జోక్యం చేసుకుని గ్రామస్తులను నివారించడం గమనార్హం. భార్య మరణం, ఆ తర్వాత జరిగిన పరిణామాలతో తీవ్ర వేదనకు గురైన చంద్రశేఖర్, ఇవాళ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కొన్ని రోజుల వ్యవధిలోనే దంపతులిద్దరూ మరణించడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనతో ఇద్దరు పిల్లలు తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మిగిలారు.

# సిద్ధిపేట నిధులెక్కడ?

**సీఎం రేవంత్‌కు హరీశ్ బహిరంగ లేఖ**

సిద్దిపేట, మార్చి 21 (ఈవార్తలు): సిద్దిపేట అభివృద్ధికి నిధులు రద్దు చేశారని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. శనివారం సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో ఆయన పలు ప్రశ్నలతో బహిరంగ లేఖ రాశారు. సిద్దిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం తాము చేస్తే శిలాఫలకం మీద ఎందుకని ప్రశ్నించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రావడానికికంటే ముందు జిల్లాకు రద్దు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1,070 కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని, మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 27 నెలల తర్వాత సిద్దిపేటకు వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట నియోజకవర్గం లేదన్నట్లుగా ఇన్నాళ్లు వ్యవహరించారని విమర్శించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం పేరిట సిద్దిపేటలో అడుగుపెడుతున్న ముఖ్యమంత్రికి తాను పలు ప్రశ్నలు సంధించదలుచుకున్నానని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిఫలమే ఈ పామాయిల్ ఫ్యాక్టరీ అని పేర్కొన్నారు. కానీ అదే కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ వాళ్లు కూలేశ్వరంగా అభివర్ణించారని మండిపడ్డారు. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన కృషి ఫలితమే అన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు,



పామాయిల్ తోటల సాగులో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. 2021 జూన్ 5న తొలి పామాయిల్ మొక్కను నాటింది తానేనని వెల్లడించారు. 2022 జనవరి 12వ తేదీన 62 ఎకరాల భూమి కేటాయించి, మార్చి 4న భూమికి ఫెన్సింగ్ పనులు మరియు స్టోరేజ్ వాటర్ రిజర్వాయర్‌ను ప్రారంభించామని తెలిపారు 2023 ఏప్రిల్ 4న ఫ్యాక్టరీకి పునాదిరాయి వేసి పనులు ప్రారంభించామని అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాత్ర కొండంత అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం పాత్ర గోరంత కూడా లేదని అన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.1,070 కోట్ల నిధులను అర్ధాంతరంగా రద్దు చేశారని ఆరోపించారు. నిధులను రద్దు చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు అధికారిక పర్యటన చేస్తున్నందున, ఆ నిధులన్నీ తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22 వేల మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. రూ.170 కోట్ల మేర రైతు భరోసా నిధులు రాలేదని, వాటిని రేపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరై, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రద్దయి ఆగిపోయిన పనుల జాబితాను ఆయన పేర్కొన్నారు. రంగనాయకసాగర్ టూరిజం, కోమటిచెరువు శిల్పారామం, సిద్దిపేట నియోజకవర్గ ఔటర్ రింగు రోడ్డు, తోర్నాలలో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల, మిట్టపల్లిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భవనం, సిద్దిపేటలో క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ హబ్, టు టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, సిద్దిపేట-ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు, -- సిద్దిపేట-కిష్టాపూర్ రహదారి, సిద్దిపేటలో మల్టీపర్పస్ ఆడిటోరియం, సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ఆగిపోయాయని అన్నారు.




## చిన్ననాటి స్నేహితుడితో కేసీఆర్ రంజాన్ వేడుకలు

గజ్వేల్, మార్చి 21 (ఈవార్తలు): మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రంజాన్ సందర్భంగా చిన్ననాటి స్నేహితుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహమ్మద్ జహంగీర్ ను, ఆయన కుటుంబ సభ్యులను కలిశారు. ఎర్రవల్లిలోని వ్యవసాయక్షేత్రంలో ఈ భేటీ జరిగింది. కేసీఆర్‌తో వారు మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు కేసీఆర్‌కు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ ను కలిసిన వారిలో బీఆర్ఎస్ రాష్ట్రనేత జుబేర్ మహమ్మద్ కూడా ఉన్నారు. కేసీఆర్ కూడా వారికి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో వారు కేసీఆర్‌కు సంప్రదాయ ఇస్లాం టోపీని బహూకరించగా, ఆయన దానిని ధరించారు. కాసేపు వారితో కలిసి పండుగ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సమావేశం పూర్తిగా వ్యక్తిగతంగా, పండుగ వాతావరణంలో స్నేహపూర్వకంగా సాగింది.

# ఆటోలకు రెట్రో ఫిటింగ్

**'క్యూర్' పరిధిలో ఈవీలుగా మార్పు**



హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు): ఆటో డ్రైవర్లకు నిజంగా ఇది తీపి కబురు. ఇక నుంచి ఇంధన ఖర్చు ఉండదు. తెలంగాణ సర్కార్ సరికొత్త స్కీమ్ ప్రకటించింది. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ పరిధిలో పెరిగిపోతున్న వాయు కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలోని పెట్రోల్, డీజిల్ ఆటోలను 'రెట్రో ఫిటింగ్' పద్ధతి ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చనున్నట్లు 2026-27 బడ్జెట్‌లో ప్రకటించింది. రాజీవ్ యువ వికాసం పథకం కింద 'ఆటో రిక్షాల పథకాన్ని' ప్రవేశపెట్టి దీని కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ కార్పొరేషన్ల ద్వారా రూ. 200 కోట్లను కేటాయించింది. ప్రస్తుతం హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ లోపల సుమారు 1.25 లక్షల ఆటోలు నడుస్తుండగా.. వాటన్నింటినీ దశలవారీగా పర్యావరణ హితంగా మార్చటమే ఈ పథకం ప్రధాన లక్ష్యం.ప్రస్తుతం పెట్రోల్, డీజిల్‌తో నడుస్తున్న ఆటోలను ఎలక్ట్రిక్‌గా మారిస్తే ఇంధన వ్యయం, నిర్వహణ సమస్యలు భారీగా తగ్గుతాయి. దీని వల్ల ఆటో డ్రైవర్లకు ఆర్థికంగా ఊరట లభిస్తుంది. ఇలా మార్చేందుకు గాను రెండు రకాల ఎలక్ట్రిక్ కిట్లు మార్కెట్‌లో ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. స్వాపబుల్ బ్యాటరీ సిస్టంను ఎంచుకుంటే రూ.1.20 లక్షలు, ఫిక్స్‌డ్ బ్యాటరీ సిస్టం అయితే రూ.2 లక్షల వరకు ఖర్చవుతాయి. ఆటో డ్రైవర్లపై ఈ ఆర్థిక భారం పడకుండా తెలంగాణ ప్రభుత్వం ఆయా సంక్షేమశాఖల కార్పొరేషన్ల ద్వారా ఈ ఖర్చును భరించాలని నిర్ణయించారు. ప్రస్తుతం క్యూర్ పరిధిలో 11,254 డీజిల్, 7,512 పెట్రోలు, 12,136 పెట్రోలు/సీఎన్జీ, 72,568 పెట్రోలు/ఎల్పీజీ ఆటోలున్నాయి. మరో 8,763 సీఎన్జీతో, 10,053 ఆటోలు ఎల్పీజీతోనడుస్తున్నాయి. వీటన్నింటిని ఎలక్ట్రిక్ ఆటోలుగా మార్చాలంటే.. స్వాపబుల్ బ్యాటరీ సిస్టంను ఎంచుకుంటే దాదాపు రూ.1,500 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఫిక్స్‌డ్ బ్యాటరీ సిస్టం అయితే రూ.2,500 కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. స్వాపబుల్ బ్యాటరీ సిస్టమ్‌ను తీసుకున్నా 2026-27 బడ్జెట్ కేటాయింపులు రూ.200 కోట్లు. ఈ నిధుల ద్వారా మొత్తం ఆటోల్ని ఎలక్ట్రిక్‌గా మార్చేందుకు దాదాపు ఏడేళ్లకుపైగా పడుతుంది. ఇప్పటికే తక్కువ కాలుష్యాన్ని విడుదల చేసే ఎల్పీజీ, సీఎన్జీ ఆటోలను మినహాయించి, కేవలం పెట్రోల్, డీజిల్ ఆటోలపైనే ముందుగా దృష్టి పెడితే ఐదేళ్లలోనే ఈ ప్రక్రియను ర్తి చేసే అవకాశం ఉంది. కాగా, ఈ నిర్ణయం వల్ల ఆటో డ్రైవర్లకు రోజువారీ ఇంధన ఖర్చులు తగ్గడమే కాకుండా, ఇంజిన్ మెయింటెనెన్స్ సమస్యలు కూడా తప్పుతాయి.

## రోహిత్ రెడ్డి ఫాంహౌజ్ సీజ్

హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు): పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్‌హౌస్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అక్కడ ఉన్న విలాసవంతమైన వాహనాలను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఫామ్ హౌస్ ఉన్న అసైన్డ్ భూమి వివాదం తెరపైకి వచ్చింది. సుమారు 2.20 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ ఫామ్‌హౌస్‌ను నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూమిలో నిర్మించినట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి పేరుతో 2006లో ఈ భూమి రిజిస్ట్రేషన్ అయినట్టు రికార్డుల్లో ఉంది. అయితే, భూభారతి రికార్డుల ప్రకారం ఇది 'జంగయ్య' అనే వ్యక్తి పేరు మీద ఉండటం గమనార్హం. నిబంధనల ప్రకారం అసైన్డ్ భూమిని విక్రయించడం లేదా రిజిస్ట్రేషన్ చేయడం చట్టవిరుద్ధం. ఈ నేపథ్యంలో... అసైన్డ్ భూమి రిజిస్ట్రేషన్ ఎలా జరిగింది? ఇందులో అధికారుల పాత్ర ఏంటి? అనే అంశాలపై సిట్, రెవెన్యూ విభాగం లోతుగా విచారిస్తున్నాయి.

## దానంతీర్పుపై హైకోర్టుకు ఏలేటి

హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల పర్వం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారలేదని అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని తన పిటిషన్ లో ఆయన కోర్టును కోరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన విషయాన్ని ఏలేటి తన పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి, మరో పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయడం పక్కాగా ఫిరాయింపు కిందికే వస్తుందని ఆయన పేర్కొన్నారు. నామినేషన్ పత్రాలనే ఆధారంగా తీసుకుని దానం నాగేందర్‌పై తక్షణమే అనర్హత వేటు వేయాలని ఏలేటి డిమాండ్ చేశారు. అంతేకాకుండా, పార్టీ మారినప్పటి నుంచి ఆయన ఎమ్మెల్యేగా పొందుతున్న జీతభత్యాలను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు స్వీకరించింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే తెలంగాణలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు దగ్గరైన నేపథ్యంలో, దానం నాగేందర్ కేసులో హైకోర్టు ఇచ్చే తీర్పు మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తును కూడా శాసించే అవకాశం ఉంది.

## ఇరాన్ దాడుల్లో తెలంగాణ వ్యక్తి దుర్మరణం

రియాద్: పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ జ్వాలలు ఓ తెలుగు వ్యక్తిని బలిగొన్నాయి. సౌదీ అరేబియాపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల కారణంగా తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాకు చెందిన రవిగోపాల్ అనే వ్యక్తి మృతి చెందినట్టు భారత విదేశాంగ శాఖ అధికారికంగా ప్రకటించింది. ఈ దాడుల వల్ల ఇప్పటివరకు మరణించిన భారతీయుల సంఖ్య ఆరుకు చేరుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మార్చి 18వ తేదీ రాత్రి సౌదీ రాజధాని రియాద్‌లోని కీలక లక్ష్యాలపై ఇరాన్ నాలుగు క్షిపణులను ప్రయోగించింది. అయితే సౌదీ గగనతల రక్షణ వ్యవస్థలు వాటిని గాలిలోనే కూల్చివేశాయి. దురదృష్టవశాత్తూ, కూల్చివేసిన క్షిపణి శకలాలు రియాద్‌లోని ఒక ఆయిల్ రిఫైనరీ సమీపంలో పడ్డాయి. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న రవిగోపాల్‌పై ఈ శకలాలు పడటంతో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. రవిగోపాల్ మృతి సమాచారంతో ఆయన కుటుంబం ఇప్పుడు పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. "18వ తేదీ రాత్రి 9.30 గంటలకు రవితో 20 నిమిషాల పాటు మాట్లాడాం. ఆ తర్వాత కాల్ కట్ అయ్యింది, అప్పటి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది" అని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. రవికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు.

## కౌశిక్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతల తిరుగుబాటు?

జమ్మికుంట, మార్చి 21 (ఈవార్తలు): హుజూరాబాద్ నియోజకవర్గ రాజకీయం మరోసారి హీటెక్కింది. గత కొంతకాలంగా ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి తీరును వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఇప్పుడు పార్టీని వీడేందుకు సిద్ధమైంది. శుక్రవారం రాత్రి జమ్మికుంటలో సుమారు వంద మందికి పైగా బీఆర్ఎస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు అత్యవసరంగా రహస్య సమావేశం నిర్వహించడం నియోజకవర్గంలో సంచలనంగా మారింది. ఈ సమావేశానికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. కౌశిక్ రెడ్డి పార్టీ కోసం ఏళ్ల తరబడి కష్టపడుతున్న వారిని విస్మరిస్తున్నారంటూ నేతలు ఈ భేటీలో తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సొంత అజెండాను అమలు చేస్తూ పార్టీ ప్రతిష్ఠను మంటగలుపుతున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో కౌశిక్ రెడ్డి నాయకత్వంలో పనిచేయడం సాధ్యం కాదని వారు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ అసమ్మతి సెగ ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల వైపు దారితీస్తోంది. సమావేశమైన నేతల్లో మెజారిటీ సభ్యులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నట్లు సమాచారం.

# సోషల్ మీడియా పరిచయాలు ప్రమాదం

**అమ్మాయిలూ జాగ్రత్త: సీపీ సజ్జనార్**

హైదరాబాద్, మార్చి 21 (ఈవార్తలు): స్మార్ట్‌ఫోన్ ఇప్పుడు ఎంతోమంది ఆడపిల్లల పాలిట శాపంగా మారుతోందని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ ఆందోళన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వినియోగం పెరిగిన తర్వాత అపరిచితులతో ఏర్పడుతున్నపరిచయాలు యువతులను ఊహించని ప్రమాదాల్లోకి నెట్టివేస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా హెచ్చరించారు. "ఇటీవల కాలంలో ఈ తరహా విషాదకర ఘటనలు నా దృష్టికి ఎక్కువగా వస్తున్నాయి. ఆ కథనాలు చూశాక ఎంతో బాధనిపిస్తోంది. సైబర్ నేరగాళ్లు అందమైన యువకులు లేదా సినీ నటుల ఫోటోలను డీపీలుగా పెట్టుకుని నకిలీ ఖాతాలతో అమ్మాయిలకు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి వాటిలో ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతున్నారు. ఆ మాయమాటలకు ఆకర్షితులై కొందరు ఆడపిల్లలు వారిని గుడ్డిగా నమ్మి తమ వ్యక్తిగత ఫోటోలను, వీడియోలను పంచుకుంటున్నారు" అని తెలిపారు. ఆ ఫోటోలను వారితో పంచుకోగానే ఆ అపరిచితులు రాక్షసులుగా మారిపోయి వాటిని అడ్డంపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. వాటిని మార్ఫింగ్ చేసి డబ్బులు కావాలని, భౌతికంగా కలవాలని వేధింపులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. పరువు పోతుందన్న భయంతో, ఈ విషయాన్ని ఇంట్లో చెప్పలేక కొందరు అమ్మాయిలు అడిగినంత డబ్బులు ముట్టజెబుతూ తీవ్ర మానసిక క్షోభను అనుభవిస్తున్నారని, ఈ వేధింపులు తాళలేక కొందరు తమ ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు విజ్ఞప్తి ఒక్కటేనని, మీకు ఆన్‌లైన్‌లో ఇలాంటి సమస్య లేదా అన్యాయం ఎదురైతే అస్సలు భయపడవద్దని, ఆ సైబర్ నేరగాళ్ల బ్లాక్ మెయిలింగ్‌కు లొంగవద్దని, ప్రాణాలు తీసుకోవద్దని సూచించారు. వెంటనే ఈ విషయాన్ని మీ తల్లిదండ్రులకు లేదా స్నేహితులకు చెప్పాలని అన్నారు. ఏమాత్రం సంకోచించకుండా డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మీకు అండగా పోలీసులు ఎల్లప్పుడూ ఉంటారని హామీ ఇచ్చారు. తల్లిదండ్రులు కూడా పిల్లలతో కాస్త సమయం గడుపుతూ, వారు ఆన్‌లైన్‌లో ఏం చేస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనేదానిపై గమనిస్తూ ఉండాలని సూచించారు. ఫేక్ ప్రొఫైల్స్, ఫేక్ నెంబర్లు, వీపీఎన్‌లు వాడితే పోలీసులకు పట్టుబడబోమని సైబర్ నేరగాళ్లు భ్రమల్లో ఉండవద్దని, మీరు ఎక్కడున్నా సరే పట్టుకొచ్చి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లలు సోషల్ మీడియాలో అప్రమత్తంగా ఉంటూ, అన్యాయం జరిగితే ధైర్యంగా ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు.



# కొండగట్టులో బండి ప్రత్యేక పూజలు

మల్యాల, మార్చి 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న సన్నిధిలో శనివారం ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత శనివారం నిర్వహించిన 'అంజన్న ఆశీర్వాద యాత్ర' ముగింపు సమయానికి ఆలయం మూసివేయడంతో, అప్పట్లో ఆయన ముఖద్వారం వద్దే మొక్కు తీర్చుకున్నారు. ఆ వెలితిని పూడ్చుకుంటూ నేడు మళ్ళీ ఆలయానికి విచ్చేశారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. గర్భాలయంలో పూజల అనంతరం బండి సంజయ్‌ను శాలువాతో సన్మానించి ఆశీర్వచనాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్ రావు, బీజేపీ నేతలు ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

# జీవన్ రెడ్డి ఇంటికి మంత్రుల క్యూ

## దుద్దిళ్ల, అడ్లూరి, ఎమ్మెల్యే సత్యం భేటీ.. కాంగ్రెస్‌లోనే ఉండాలని వినతి

జగిత్యాల, మార్చి 21 (ఈవార్తలు): దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో కీలక పాత్రను పోషించిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని దారికి తెచ్చుకునేందుకు అధికార పార్టీ సర్వశక్తులూ ఒడ్డుతోంది. పార్టీ ఫిరాయింపులు, వలస నేతల ప్రాధాన్యతపై రగిలిపోతున్న జీవన్ రెడ్డిని బుజ్జగించేందుకు మంత్రుల బృందం రంగంలోకి దిగింది. శనివారం ఉదయం ఆయన నివాసంలో జరిగిన ఈ భేటీ ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పిలుపును కూడా తిరస్కరించిన జీవన్ రెడ్డిని ప్రసన్నం చేసుకునేందుకు మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆయన ఇంటికి వెళ్లారు. మీడియాను లోపలికి అనుమతించకుండా, అల్పాహారం చేస్తూ సుమారు గంటన్నర పాటు జీవన్ రెడ్డితో వీరు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. 'నేటి కాంగ్రెస్ పార్టీ రాజీవ్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా లేదు' అని ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మంత్రుల ముందే తన ఆవేదనను వెళ్లగక్కినట్లు సమాచారం. సొంత పార్టీ నేతలకు అన్యాయం చేస్తూ, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికి పెద్దపీట వేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మంత్రులు ఎంత బతిమాలినా జీవన్ రెడ్డి మెత్తబడినట్లు కనిపించడం లేదని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, కాంగ్రెస్ పార్టీని వీడాలని ఆయన ఇప్పటికే తన నిర్ణయాన్ని తీసేసుకున్నారని తెలుస్తోంది. ఈ నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి ప్రాథమిక సభ్యత్వంతో పాటు తన పదవులకు కూడా జీవన్ రెడ్డి రాజీనామా చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.



# 62 ఏళ్లకు పీఎస్‌యూ ఉద్యోగుల రిటైర్మెంట్

అమరావతి, మార్చి 21 (ఈవార్తలు): ఏపీలోని ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. వీరి పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ అంశంపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణలతో కూడిన కమిటీ ఇప్పటికే సమావేశమైంది. పదవీ విరమణ వయసు పెంపునకు ఈ కమిటీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఈ నిర్ణయం అమలైతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,500 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, 9, 10 షెడ్యూల్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై దృష్టి సారించి, మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వయసు పెంపు వల్ల ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం వంటి అంశాలను కూడా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి, ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.



# పోటీ పరీక్షల అభ్యర్థులకు పుస్తకాల పంపిణీ

కాకినాడ, మార్చి 21 (ఈవార్తలు): గోదావరి డెల్టా చైర్మన్ మొరాల శెట్టి సునీల్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఏపీలోని కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆయన కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 50 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, సాధన సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సునీల్ మాట్లాడుతూ, పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు సరైన మార్గదర్శకం, అవసరమైన వనరులు కీలకమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రతిభ గల విద్యార్థులు వెనుకబడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, యువకులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ నేతలతో జీవన్ రెడ్డి ప్రార్థనలు

జగిత్యాల, మార్చి 21 (ఈవార్తలు): రంజాన్ పర్వదినం సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి.. బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొనడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనం సృష్టించింది. కేవలం పండుగ శుభాకాంక్షలు చెప్పుకోవడమేనా? లేక ఇది 'గులాబీ' గూటికి చేరేందుకు వేసిన తొలి అడుగా? అన్న చర్చ ఊపందుకుంది. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరినప్పటి నుండి జీవన్ రెడ్డి తీవ్ర అసహనంతో ఉన్నారు. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న తన కంటే, ఇతర పార్టీల నుండి వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే తన నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించడం ద్వారా ఆయన తన నిరసనను బహిరంగంగానే వ్యక్తపరిచారు. పార్టీ కార్యక్రమాలకు కూడా ఆయన దూరంగా ఉంటున్నారు. నేడు రంజాన్ ప్రార్థనల అనంతరం బీఆర్ఎస్ ముఖ్య నేతలతో జీవన్ రెడ్డి చాలా సేపు ఏకాంతంగా ముచ్చటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సాధారణంగా ప్రత్యర్థి పార్టీ నేతలతో ఇంత ఆత్మీయంగా కనిపించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందనేది విశ్లేషకుల అభిప్రాయం. ఇప్పటికే తన అనుచరులతో చర్చలు పూర్తి చేసిన జీవన్ రెడ్డి, త్వరలోనే తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు.



# బొమ్మెనలో ఘనంగా రంజాన్ వేడుకలు

కథలాపూర్, మార్చి 21 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని బొమ్మెనలో శనివారం రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు అలయ్ బలయ్ తీసుకొని, శుభాకాంక్షలు తెలుపుకున్నారు. తమ కుటుంబ సభ్యులతో విందు భోజనాలకు ఏర్పాట్లు చేసుకున్నారు.

# 'దెయ్యాల మలుపు' వద్ద ఇన్‌వర్టెడ్ మిర్రర్

శ్రీశైలం, మార్చి 21 (ఈవార్తలు): శ్రీశైలం వెళ్లే ఘాట్ రోడ్డులో అత్యంత ప్రమాదకరమైన ప్రదేశంగా పేరుపడ్డ 'దెయ్యాల మలుపు' వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. దోర్నాలకు సమీపంలోని ఈ బ్లాక్‌స్పాట్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో, దోర్నాల పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. యర్రగొండపాలెం సీఐ, దోర్నాల పోలీస్ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో ఈ మలుపును పరిశీలించారు. ఈ మలుపు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించి, వెంటనే నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా, ఎదురుగా వచ్చే వాహనాలు డ్రైవర్లకు స్పష్టంగా కనిపించేలా ఒక 'ఇన్‌వర్టెడ్ మిర్రర్' (కుంభాకార దర్పణం) ను ఏర్పాటు చేశారు.





# తిరుమల పవిత్రతను కాపాడుతాం

## ఏపీ సీఎం చంద్రబాబు హామీ

తిరుమల, మార్చి 21 (ఈవార్తలు): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడటం, భక్తుల మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమలలో శనివారం ఆయన టీటీడీ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, భక్తుల విశ్వాసాన్ని మరింతగా చూరగొనేలా, పారదర్శకమైన, అత్యున్నత ప్రమాణాలతో కూడిన సేవలు అందించాలని అధికారులను దిశానిర్దేశం చేశారు. సామాన్య భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. టెక్నాలజీ సహాయంతో భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించి, వారికి సులభంగా, త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించాలని ఆదేశించారు. ఇది భక్తులపై మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, దర్శన ప్రక్రియలో పారదర్శకతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. ప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యి, ఇతర



ముడి సరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాటు చేసిన అత్యాధునిక ల్యాబ్‌ను పటిష్టంగా నిర్వహించాలని, కల్తీకి ఏమాత్రం ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారు. తాను స్వయంగా కొందరు భక్తులను కలిసినప్పుడు వారు ప్రసాదం నాణ్యతపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని, ఆ నమ్మకాన్ని నిరంతరం కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. "పేదల సేవయే భగవంతుని సేవ" అనే స్ఫూర్తితో టీటీడీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలోని స్విమ్స్, బర్డ్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ వంటి వైద్య సంస్థల ద్వారా అందిస్తున్న సేవలపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. అరుదైన వ్యాధులతో బాధపడే పేద రోగుల చికిత్స కోసం ప్రాణదానం ట్రస్ట్ ద్వారా నెలకు అదనంగా రూ.1 కోటి నిధులను సమకూరుస్తున్నట్లు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. దివంగత ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన అన్నదానం కార్యక్రమాన్ని టీటీడీ పరిధిలోని 57 ఆలయాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నారని, త్వరలోనే మరో 4 ఆలయాల్లో ప్రారంభిస్తామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర ప్రధాన దేవాలయాల్లో కూడా అమలు చేసేలా చూడాలని సీఎం సూచించారు. ధర్మప్రచారంలో భాగంగా టీటీడీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.750 కోట్ల వ్యయంతో 5,000 నూతన ఆలయాల నిర్మాణ ప్రణాళికను ముఖ్యమంత్రి సమీక్షించారు. అంతేకాకుండా, దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ తిరుమల శ్రీవారి ఆలయం తరహాలో ఆలయాలు నిర్మించే ప్రతిపాదనలపై దృష్టి సారించాలని ఆదేశించారు. తిరుమల కొండపై శ్రీవారి సేవకుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు 17.12 లక్షల మంది సేవకులు తమ సేవలను అందించారని, సాధారణ రోజుల్లో 3000 మంది, రద్దీ రోజుల్లో 4000 మంది వరకు సేవకులు భక్తులకు సేవలందిస్తున్నారని అధికారులు సీఎంకు వివరించారు. అన్నదానం, క్యూలైన్ల నిర్వహణ వంటి కీలక విభాగాల్లో వారి సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, టీటీడీ ఉన్నతాధికారులు, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష ఉద్యోగాలతో

# ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్



అనకాపల్లి, మార్చి 21 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ ముందడుగు పడుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు గత 21 నెలలుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు ఉత్పాదక సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా), రాష్ట్రంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఈనెల 23వ తేదీన (సోమవారం) ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులతో కలిసి భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్నే మార్చగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు. సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో 5,465 ఎకరాల విస్తీర్ణంలో ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. తొలిదశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, ఈ ప్లాంట్ ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తుంది. దేశీయంగా పెరుగుతున్న ఉక్కు డిమాండ్‌ను అందుకోవడంలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషించనుంది. ఈ భారీ స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా ఏఎంఎన్ఎస్ ఇండియా సంస్థ ప్రత్యేకంగా ఒక క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మించనుంది. ఇందుకోసం అదనంగా రూ.11,198 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 316 ఎకరాల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ పోర్టును అభివృద్ధి చేస్తారు. ఈ పోర్టు నిర్మాణం ద్వారా మరో 6,000 మందికి ఉపాధి లభించనుంది. ఈ స్టీల్ ప్లాంట్, క్యాప్టివ్ పోర్టు రాకతో విశాఖ ఎకనమిక్ రీజియన్ ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా (హబ్) రూపాంతరం చెందనుంది.

# మరోసారి వివాదంలో గరికపాటి



అమరావతి, మార్చి 21 (ఈవార్తలు): తన వాగ్ధాటితో కోట్లాది మందిని అలరించే ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు, మరోసారి తన మాటలతో వివాదంలో చిక్కుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆయన విమర్శించిన తీరు అమానవీయంగా ఉందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పసిపిల్లలను "శోభనపు పెళ్ళికొడుకుల"తో పోల్చడం అగ్నికి ఆజ్యం పోసింది. తాజా వివాదం వివరాల్లోకి వెళితే... పిల్లలకు పుస్తకాలు, బట్టలు, భోజనం అన్నీ ఉచితంగా ఇస్తుంటే వారికి చదువుపై శ్రద్ధ ఉండదని, అన్నీ వారే సమకూర్చుకుంటేనే బాధ్యత పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం మానేసి, ప్రభుత్వం ఇచ్చే కోడిగుడ్ల లెక్కలు చూసుకోవడానికే సమయం సరిపోతోందని ఎద్దేవా చేశారు. ఈ క్రమంలో పాఠశాలలకు వచ్చే విద్యార్థులను ఆయన శోభనపు పెళ్లికొడుకులతో పోల్చారు. ఈ వ్యాఖ్యలు దుమారం రేపాయి. సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు గరికపాటిపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. "కనీసం ఒక పూట తిండి దొరుకుతుందనే ఆశతో బడికి వచ్చే నిరుపేద చిన్నారులు లక్షల మంది ఉన్నారు. వారి ఆకలిని కించపరచడం తగునా?" అని పలువురు ప్రశ్నిస్తున్నారు. డ్రాపౌట్స్ (చదువు మానేసేవారు) తగ్గించడానికి, పోషకాహార లోపాన్ని నివారించడానికి ప్రపంచవ్యాప్తంగా అంగీకరించబడిన విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అపహాస్యం చేయడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని మండిపడుతున్నారు. ఒక పండితుడి హోదాలో ఉండి, చిన్నారుల పట్ల అంతటి అసభ్యకరమైన పోలికను వాడటం సంస్కారం అనిపించుకోదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# మత్స్యకారుల వివాదంతో నాకు సంబంధం లేదు

నెల్లూరు, మార్చి 21 (ఈవార్తలు): తమిళనాడు బోట్ల వ్యవహారంలో తనపై సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ప్రచారాన్ని టీడీపీ రాజ్యసభ సభ్యుడు బీదా మస్తాన్ రావు తీవ్రంగా ఖండించారు. శనివారం నెల్లూరు జిల్లాలో పర్యటించిన ఆయన... మత్స్యకారుల మధ్య జరుగుతున్న వివాదంతో తనకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఈ వివాదానికి సంబంధించి తాను ఏ అధికారితో కానీ, గ్రామస్థులతో కానీ మాట్లాడలేదని, కావాలనే తన ప్రతిష్ఠకు భంగం కలిగించేలా కొందరు కుట్రలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. మత్స్యకారుల ప్రయోజనాల కోసం నిరంతరం శ్రమించే తనపై ఇలాంటి ఆరోపణలు రావడం అత్యంత దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, తాను కూడా ఈ అంశంపై పూర్తిస్థాయి విచారణ జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరినట్లు వెల్లడించారు. అంతేకాకుండా, ఈ వివాదాన్ని ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. తన జీవితంలో మత్స్యకార గ్రామాల గౌరవానికి భంగం కలిగించే పని ఏనాడూ చేయలేదని, భవిష్యత్తులో కూడా చేయబోనని ఆయన తెలిపారు. రాజకీయ ప్రయోజనాల కోసం వాస్తవాలు తెలుసుకోకుండా చేసే దుష్ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.




# విమానాలపై యుద్ధ ప్రభావం పడనివ్వం



న్యూఢిల్లీ: ప్రస్తుతం కొనసాగుతున్న యుద్ధ పరిస్థితుల ప్రభావం విమానయాన రంగంపై ఉన్నప్పటికీ, ఆ ఆర్థిక భారాన్ని ప్రయాణికులపై పడకుండా చూసేందుకు కట్టుబడి ఉన్నామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. యుద్ధం కారణంగా విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలపై ప్రభావం కచ్చితంగా ఉంటుందని, అయితే ఆ భారాన్ని ప్రయాణికులకు బదిలీ చేయకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఈ విషయంపై పౌర విమానయాన, విదేశాంగ, పెట్రోలియం శాఖలతో కలిసి ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నామని, విమానయాన సంస్థల నుంచి కూడా నిరంతరం ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నామని ఆయన వివరించారు. దీంతో పాటు ప్రయాణికులకు అనుకూలంగా పలు కొత్త చర్యలను కూడా రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. ఇకపై విమానాల్లో 60 శాతం సీట్లను ఎలాంటి అదనపు రుసుము లేకుండా ఉచితంగా ఎంచుకునే వెసులుబాటు కల్పించాలని విమానయాన సంస్థలను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే, క్రీడా పరికరాలు, సంగీత వాయిద్యాలను తరలించే విషయంలో మరింత సరళంగా వ్యవహరించాలని, పెంపుడు జంతువుల ప్రయాణానికి సంబంధించి స్పష్టమైన విధానాలను ప్రవేశపెట్టాలని సూచించారు. విమానాల ఆలస్యం, రద్దు వంటి సందర్భాల్లో ప్రయాణికులకు అందాల్సిన పరిహారం, వారి హక్కులపై అవగాహన పెంచేందుకు ప్రాంతీయ భాషల్లోనూ విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. పశ్చిమాసియాలోని కొన్ని విమానాశ్రయాలు ప్రస్తుతానికి పనిచేయడం లేదని, అయినా కీలక మార్గాల్లో ప్రయాణాలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రయాణికుల సౌకర్యానికే తమ తొలి ప్రాధాన్యత అని ఆయన పునరుద్ఘాటించారు.

## తగ్గింపు ధరల్లో సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్లు

న్యూఢిల్లీ: భారతదేశంలోని కోట్లాది టైప్ 2 మధుమేహ రోగులకు ఒకేసారి భారీ శుభవార్త అందింది. దేశంలోని మూడు దిగ్గజ ఫార్మాస్యూటికల్ కంపెనీలు డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, గ్లెన్‌మార్క్ ఫార్మాస్యూటికల్స్, జైడస్ లైఫ్‌సైన్సెస్ తమ జెనరిక్ సెమాగ్లుటైడ్ ఇంజెక్షన్లను మార్కెట్లోకి విడుదల చేశాయి. అధునాతన మధుమేహ చికిత్సలో ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఈ ఔషధం పేటెంట్ గడువు ముగియడంతో, ఈ కంపెనీలు తమ ఉత్పత్తులను ఒకేసారి ఆవిష్కరించాయి. ఇప్పటికే నోవో నార్డిస్క్, నాట్కో ఫార్మా సంస్థలు తమ సెమాగ్లుటైడ్ మందులతో బరిలో దిగాయి. ఈ తీవ్రమైన పోటీ ఫలితంగా, ఇప్పటివరకు అత్యంత ఖరీదైనదిగా ఉన్న ఈ చికిత్స ఇప్పుడు సామాన్యులకు సైతం అందుబాటులోకి రానుంది. ప్రపంచంలోనే అత్యధిక మధుమేహ రోగులున్న దేశాల్లో భారత్ ఒకటి. ఐసీఎంఆర్-ఇండియాబ్ అధ్యయనం ప్రకారం, దేశంలో 10.1 కోట్ల మందికి పైగా మధుమేహంతో బాధపడుతుండగా, మరో 13.6 కోట్ల మంది ప్రీ-డయాబెటిక్ దశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో, సెమాగ్లుటైడ్ వంటి అధునాతన చికిత్సల ఆవశ్యకత ఎంతో ఉంది. జీఎల్పీ-1 రిసెప్టర్ అగోనిస్ట్ రకానికి చెందిన ఈ ఇంజెక్షన్, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడమే కాకుండా, ఊబకాయాన్ని తగ్గించడంలో కూడా సమర్థవంతంగా పనిచేస్తుందని నిరూపితమైంది.



## ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రం : ఇజ్రాయెల్

జెరూసలెం: ఇరాన్‌పై వచ్చేవారం దాడులు మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ హెచ్చరించారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త వైమానిక దాడులు ఉద్ధృతం చేస్తామని కాట్జ్ తెలిపినట్లుగా ఇజ్రాయెల్ పత్రిక ఒకటి తెలిపింది. ఇరాన్ పాలకులు, ఆ దేశానికి ఆదాయవనరుగా ఉన్న మౌలిక సదుపాయాలపై తమ రెండు దేశాలు జరిపే దాడులు మరింత పెరుగుతాయని అన్నారు. ఈ యుద్ధం లక్ష్యాలను సాధించేవరకు ఆపేది లేదని కాట్జ్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు ఆ దేశ పాలనా యంత్రాంగం, కమాండర్లు, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేశారు. ఇరాన్‌పై క్రమంగా సైనిక చర్యను తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ మంత్రి నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఇరాన్ నుంచి అణుముప్పును తొలగించడం, దాని సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడం, ఆ దేశ ప్రజలకు స్వేచ్ఛను కల్పించడమే తమ ముందున్న లక్ష్యాలని అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ అన్నారు.

# ఇరాన్ చమురు అమ్మకాలకు అమెరికా ఓకే





న్యూఢిల్లీ: ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అనూహ్య నిర్ణయం తీసుకుంది. గ్లోబల్ ఇంధన మార్కెట్లపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు, సముద్రంలో ఇప్పటికే రవాణా అవుతున్న ఇరాన్ చమురు అమ్మకాలకు 30 రోజుల పాటు తాత్కాలికంగా అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ చర్య ద్వారా ప్రపంచ మార్కెట్లలో చమురు ధరలను స్థిరీకరించాలని ట్రంప్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ విషయాన్ని అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 19 మధ్య నౌకల్లోకి ఎక్కించిన ఇరాన్ ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకాలకు మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన లైసెన్స్‌లో స్పష్టం చేసింది. కొత్తగా చమురు ఉత్పత్తి చేయడానికి గానీ, కొనుగోలు చేయడానికి గానీ ఈ వెసులుబాటు వర్తించదని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో సుమారు 14 కోట్ల బ్యారెళ్ల చమురు ప్రపంచ మార్కెట్లకు అందుబాటులోకి వస్తుందని బెస్సెంట్ వివరించారు. ఇరాన్‌తో కొనసాగుతున్న "ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ" కారణంగా ఏర్పడిన సరఫరా అంతరాయాలను అధిగమించేందుకే ఈ చర్య తీసుకున్నామని ఆయన తెలిపారు. "ధరలను అదుపులో ఉంచేందుకు మేము ఇరాన్ బ్యారెళ్లనే టెహ్రాన్‌కు వ్యతిరేకంగా వాడుతున్నాం" అని బెస్సెంట్ చేసిన వ్యాఖ్యలు అమెరికా వ్యూహాన్ని స్పష్టం చేస్తున్నాయి. అదే సమయంలో ఈ వెసులుబాటును అలుసుగా తీసుకోవద్దని ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇరాన్ పొందడం కష్టతరం చేస్తామని, ఆ దేశంపై ఒత్తిడి విధానం యథాతథంగా కొనసాగుతుందని ఆయన తేల్చి చెప్పారు. ప్రపంచ ఉగ్రవాదానికి ఇరాన్ కేంద్రంగా మారిందని ఆరోపించిన బెస్సెంట్, ఆంక్షల పరిధిలోని ఇరాన్ చమురును చైనా చౌకగా కొనుగోలు చేసి నిల్వ చేసుకుంటోందని విమర్శించారు. ఇటీవలి వారాల్లో రష్యా చమురు విషయంలోనూ ఇలాంటి సడలింపులు ఇచ్చిన అమెరికా, తాజా నిర్ణయంతో మార్కెట్లను స్థిరీకరించే ప్రయత్నం చేస్తోంది. ఒకవైపు సైనిక, ఆర్థిక ఒత్తిడి కొనసాగిస్తూనే, మరోవైపు వ్యూహాత్మక జలసంధి అయిన హర్మూజ్ గుండా ఇంధన సరఫరాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలన్నది అమెరికా ఉద్దేశంగా కనిపిస్తోంది. ప్రపంచానికి ఇంధన సరఫరాను పెంచేందుకు అమెరికా తన ఆర్థిక, సైనిక శక్తిని వినియోగిస్తూనే ఉంటుందని బెస్సెంట్ స్పష్టం చేశారు.

# ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయ్

**ఆధునిక యుద్ధాలతో తీవ్ర ఇబ్బందులు**

**కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి**



న్యూఢిల్లీ: ఆధునిక యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను, సైబర్ స్పేస్‌ను దెబ్బతీస్తున్నాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని అన్నారు. యుద్ధం సరిహద్దులను దాటి ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలో భాగమయ్యాయని పేర్కొన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి దేశపౌరుడు అన్ని సమయాల్లో దేశ రక్షణకు సిద్ధమై ఉండాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. ఆధునిక యుద్ధాలకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సాయుధ దళాలకు ఆధునాతన, స్వదేశీ ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశ రక్షణలో యువత తనవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, యువత దేశం కోసం ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. సైన్యం, పౌరులు బలంగా ఉంటేనే దేశం ముందుకు సాగుతుందని అన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు. గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. పీపీపీ నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతున్నారని, ఇది చారిత్రాత్మక ముందడుగు అన్నారు. ఇది దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందని అన్నారు.

# మా జోలికి రావొద్దు

**బ్రిటన్‌కు ఇరాన్ వార్నింగ్**



టెహ్రాన్: అమెరికా-ఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్, బ్రిటన్‌కు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడి చేసేందుకు అమెరికా దళాలకు బ్రిటన్ తన సైనిక స్థావరాలను ఉపయోగించుకునేందుకు అనుమతి ఇస్తోందన్న నివేదికల నేపథ్యంలో ఇరాన్ శనివారం తీవ్రంగా స్పందించింది. ఈ వివాదంలో బ్రిటన్ జోక్యం శ్రుతి మించితే, ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ఓ పోస్ట్ చేశారు. "ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ చేస్తున్న ఈ యుద్ధంలో భాగం కావాలని బ్రిటన్ ప్రజల్లో అధిక శాతం మంది కోరుకోవడం లేదు. కానీ, వారి ప్రధాని స్టార్మర్ మాత్రం సొంత ప్రజల అభిప్రాయాన్ని విస్మరించి, ఇరాన్‌పై దాడికి యూకే స్థావరాలను వాడేందుకు అనుమతిస్తున్నారు. తద్వారా ఆయన బ్రిటిష్ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మరక్షణ హక్కును వినియోగించుకోవడానికి ఇరాన్ వెనుకాడదు" అని అరాఘ్చీ తన పోస్టులో పేర్కొన్నారు. ఈ వివాదం తమది కాకపోయినా, బ్రిటన్ అనవసరంగా తలదూరుస్తోందని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఈ అంశంపై ఇరాన్ తన ఆందోళనను అధికారికంగా కూడా బ్రిటన్‌కు తెలియజేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చీ, బ్రిటన్ హోం మంత్రి యెవెట్ కూపర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అమెరికాకు సైనిక స్థావరాలను అందుబాటులో ఉంచడాన్ని "తమపై జరుగుతున్న దురాక్రమణలో పాలుపంచుకోవడంగానే" పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. అయితే, ఇరాన్ హెచ్చరికలకు బ్రిటన్ కూడా గట్టిగానే బదులిచ్చింది. అరాఘ్చీతో జరిగిన ఫోన్ సంభాషణలోనే హోం మంత్రి యెవెట్ కూపర్ తమ వైఖరిని స్పష్టం చేశారు. "బ్రిటన్ స్థావరాలు, భూభాగం, లేదా ఇతర ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకోవద్దని" ఆమె ఇరాన్‌ను హెచ్చరించారు. అలాంటి ప్రయత్నాలు చేస్తే ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆమె తేల్చిచెప్పారు. ఈ పరస్పర హెచ్చరికలతో ఇరాన్, బ్రిటన్ మధ్య దౌత్యపరమైన వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

## రాహుల్ బీజేపీ బీ-టీమ్

**కేరళ సీఎం విజయన్ ఆసక్తికర వ్యాఖ్య**



తిరువనంతపురం: కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ బీజేపీ 'బీ-టీమ్' అని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. త్వరలో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. దేశవ్యాప్తంగా బీజేపీకి పోటీగా కాంగ్రెస్ పార్టీని భావిస్తుంటారు. ఈ నేపథ్యంలో శనివారం ఒక మీడియా సంస్థతో ముఖ్యమంత్రి మాట్లాడారు. ఇటీవల కేరళలో పర్యటించిన రాహుల్ గాంధీ రాష్ట్ర ప్రభుత్వంపై, పినరయి విజయన్‌పై విమర్శలు గుప్పించారు. దేశంలోని ప్రతిపక్ష నాయకులను కేంద్ర ఏజెన్సీలు అరెస్టు చేశాయని లేదా విచారణ జరిపాయని... కానీ కేరళ ముఖ్యమంత్రి విజయన్‌ను మాత్రం ప్రశ్నించడం లేదని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలపై విజయన్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ బుజ్జగింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. మెజారిటీ, మైనారిటీ అంటూ దేశంలో మతరాజకీయాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. సీపీఐ(ఎం) నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కూటమి ఎలాంటి మతతత్వానికి అయినా వ్యతిరేకమే అన్నారు. మతతత్వ కార్యకలాపాలలో నిమగ్నమైన ఎవరి మద్దతును తాము కోరేది లేదని స్పష్టం చేశారు. ఇటీవల ముగ్గురు సీపీఐ(ఎం) పార్టీకి చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీ అండతో ఇండిపెండెంట్లుగా పోటీ చేయడంపై విజయన్ స్పందించారు. కొందరు పార్లమెంటుకు వెళ్లాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారని, కానీ వాళ్లు ఎంతోకాలంగా నిర్మించుకున్న రాజకీయ వారసత్వాన్ని పోగొట్టుకున్నారని అన్నారు. ప్రతిపక్షాలతో చేతులు కలిపి తమ పార్టీని దెబ్బతీయాలనుకుంటున్నారని విమర్శించారు.

## అమెరికాకు సాయం చేయలేదు

**ఇరాన్ యుద్ధంపై భారత్ క్లారిటీ**

న్యూఢిల్లీ: ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో అమెరికా భారత్ సహాయం కోరిందని సామాజిక మాధ్యమాల వేదికగా జరుగుతోన్న ప్రచారంపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఇవి పూర్తిగా నిరాధారమైన వార్తలంటూ కొట్టిపారేసింది. పశ్చిమాసియాలో 22 రోజుల క్రితం ప్రారంభమైన యుద్ధం రోజురోజుకూ తీవ్రమవుతోంది. ఈ నేపథ్యంలో పశ్చిమ భారత్ నుంచి ఇరాన్‌పై దాడులు చేయడానికి వీలుగా మిలటరీ స్థావరాలను వినియోగించుకుంటామని అమెరికా అడిగినట్లు ప్రచారం జరిగింది. ఇందుకు సంబంధించి ఇంగ్లీష్ మీడియాలో కథనాలు రావడంతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. ఇలాంటి అసత్య ప్రచారాలను విశ్వసించవద్దని కోరింది. నిరాధారమైన, కల్పిత విషయాలపై జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించింది. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో భారత్‌పై కొన్ని అసత్య ప్రచారాలు జరుగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలో శ్రీలంకకు సమీపంలో ఇరాన్‌కు చెందిన ఐరిస్ దేనా యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి ముంచివేసింది. ఆ సమయంలో భారత పోర్టులను అమెరికా ఉపయోగించుకుంటోందనే ప్రచారం జరగగా, ప్రభుత్వం ఖండించింది. ఇటీవల శ్రీలంక అధ్యక్షుడు అనురకుమార దిసనాయక ఆ దేశ పార్లమెంటులో మాట్లాడుతూ, రెండు యుద్ధ విమానాల కోసం అమెరికా తమ పోర్టులను ఉపయోగించుకుంటామని చెబితే తిరస్కరించామని వెల్లడించారు. తాము యుద్ధంలో తటస్థంగా ఉంటున్నామని, అందుకే తమ పోర్టులను ఉపయోగించుకోవడానికి అంగీకరించలేదని తెలిపారు. శ్రీలంక అధ్యక్షుడి ప్రకటన అనంతరం భారత్ సహాయం కూడా అమెరికా కోరినట్లు ప్రచారం జరగడం గమనార్హం.

## భూటాన్‌లోనూ యూపీఐ సేవలు




న్యూఢిల్లీ: భారత యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలు సరిహద్దులకు ఆవల కూడా విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలో పొరుగుదేశమైన భూటాన్‌తో సరిహద్దు చెల్లింపుల కోసం భారత్ ఒక కీలక ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య డబ్బు పంపడం మరింత చౌకగా, సులభంగా మారనుంది. పోస్టల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి ఈ నగదు బదిలీ ప్రక్రియను అమలు చేయనున్నారు. ఈ మేరకు భారత పోస్టల్ శాఖ, భూటాన్ పోస్టల్ శాఖ మధ్య ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) వారి 'పాస్‌ట్రాన్స్‌ఫర్' సిస్టమ్‌ను భారత్ యూపీఐతో అనుసంధానించడం ద్వారా ఈ సేవలను అందిస్తారు. ఈ చొరవతో ఇరు దేశాల పౌరులకు డిజిటల్ చెల్లింపు సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని, ఆర్థిక సంబంధాలు బలపడతాయని అధికారిక ప్రకటనలో తెలిపారు. కేవలం నగదు బదిలీకే పరిమితం కాకుండా, పోస్టల్ కార్యకలాపాలు, టెక్నాలజీ అభివృద్ధి, శిక్షణ, లాజిస్టిక్స్, ఫిలాటెలీ (తపాలా బిళ్లల సేకరణ) వంటి పలు రంగాల్లో సహకరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఇందులో భాగంగా, భూటాన్ పోస్టల్ అధికారులకు భారత్‌లోని రఫీ అహ్మద్ కిద్వాయ్ నేషనల్ పోస్టల్ అకాడమీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల్లో శిక్షణ ఇవ్వనున్నారు. అంతేగాక డిజిటల్ పోస్టల్ సిస్టమ్స్, డిజిటల్ అడ్రస్ కోడ్ వంటి అత్యాధునిక టెక్నాలజీల అనుభవాన్ని భూటాన్‌తో పంచుకోవడానికి భారత్ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఆర్థిక సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో పోస్టల్ నెట్‌వర్క్ పాత్రపై తమ అనుభవాన్ని పంచుకోవడానికి కూడా ముందుకొచ్చింది. ఫిలాటెలీ ప్రదర్శనలకు భూటాన్‌ను ఆహ్వానిస్తూ సాంస్కృతిక బంధాన్ని కూడా బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు.

## విద్యార్థిని కాల్చి చంపిన మరో విద్యార్థి!

**వారణాసి కాలేజీలో దారుణం..**

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కాలేజీ క్యాంపస్‌లోనే విద్యార్థిని మరో విద్యార్థి తుపాకీతో అతి కిరాతకంగా కాల్చి చంపాడు. ఉదయ్ ప్రతాప్ కాలేజీలో శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. బీఎస్సీ చదువుతున్న సూర్య ప్రతాప్ సింగ్ (23) అనే విద్యార్థిని, మంజీత్ చౌహాన్ అనే మరో విద్యార్థి హత్య చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరిద్దరి మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే హత్య జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నిందితుడు మంజీత్.. సూర్య ప్రతాప్‌పై దాదాపు 8 రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. కింద పడిపోయిన తర్వాత కూడా అతనిపైకి ఎక్కి మరీ కాల్పులు జరపడం అక్కడున్న వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దారుణానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనతో కాలేజీ క్యాంపస్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆగ్రహించిన తోటి విద్యార్థులు ఫర్నిచర్ ను ధ్వంసం చేసి నిరసనలకు దిగారు. మరోవైపు, మృతుడి తండ్రి తన కుమారుడి అంత్యక్రియలు నిర్వహించేందుకు నిరాకరించారు. "నా కొడుకును చంపిన వాడిని ఎన్‌కౌంటర్ చేయాలి. అప్పుడే వాడి ఆత్మకు శాంతి" అని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న వారణాసి పోలీసులు ప్రధాన నిందితుడు మంజీత్ చౌహాన్ ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రమేయమున్న ఇతరుల కోసం గాలిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాలేజీ వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

ఈవార్తలు
వినోదవాణి
CINEMA
ఆదివారం 22-3-2026, జగిత్యాల
www.evarthalu.com


లవ్లీ చిత్రం


సంయుక్త మీనన్


## చంపేస్తామని బెదిరిస్తున్నారు

మహాకుంభమేళాలో రుద్రాక్షలు విక్రయిస్తూ సోషల్ మీడియా ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన మోనాలిసా భోంస్లే జీవితం ఇప్పుడు మలుపులు తిరుగుతోంది. వైరల్ గర్ల్‌గా పేరు తెచ్చుకున్న మోనాలిసా ఇటీవల ఫర్మాన్ ఖాన్ అనే ముస్లిమ్ యువకుడిని ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పెళ్లి తర్వాత తమ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని.. కొంతమంది వ్యక్తులు తమను చంపేస్తామని బహిరంగంగా బెదిరిస్తున్నారని మోనాలిసా ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు తనకు రక్షణ కల్పించాలని కోరుతూ అధికారులకు విజ్ఞప్తి చేసింది.





## ఐశ్వర్యరాయ్‌కు స్నేహా ఉల్లాల్ సారీ



'ఉల్లాసంగా ఉత్సాహంగా' సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది స్నేహా ఉల్లాల్. అప్పటికే 'లక్కీ: నో టైం ఫర్ లవ్' (2005) చిత్రంతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చింది. అలా ఓపక్క హిందీ సినిమాలు చేస్తూ మరోపక్క తెలుగు చిత్రాల్లో నటించింది. మధ్యలో కొంతకాలం సినిమాలకు గ్యాప్ ఇవ్వగా ఆ తర్వాత అడపాదడపా సినిమాల్లో కనిపిస్తోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్నేహ తన కెరీర్ తొలినాళ్ల గురించి ఓపెన్ అయింది. ఆమె మాట్లాడుతూ.. లక్కీ మూవీతో నా సినీరంగ ప్రవేశం జరిగింది. చిత్రీకరణ సమయంలో హీరో సల్మాన్ ఖాన్ నాకెంతో సపోర్ట్ చేశాడు. ఎప్పుడూ ఓపిక, సహనంతో మెదిలేవాడు. తానో పెద్ద హీరో అని ఎన్నడూ యాటిట్యూడ్ చూపించలేదు. నిజానికి నేను సినిమాల్లోకి రావాలని ఎప్పుడూ అనుకోలేదు. కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో ఐశ్వర్యరాయ్ మిస్ వరల్డ్ కిరీటం అందుకుంది. చూడటానికి నేను ఐశ్వర్యరాయ్‌లాగే ఉంటానని చాలామంది అంటుంటారు. అలా ఆమె మిస్ వరల్డ్ కిరీటం ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు అందుకుంటే నా చుట్టూ ఉన్న చిన్నప్రపంచంలో నేను సెలబ్రిటీ అయిపోయాను. నేను ఒకే ఒక్కసారి ఐశ్వర్యను కలిశాను. నన్ను చూడగానే ఆమె 'వెల్‌కమ్ టు ద ఫ్యామిలీ.. బాలీవుడ్‌కు స్వాగతం' అని సాదరంగా ఆహ్వానించింది. అప్పుడు వెంటనే నేను ఆమెకు సారీ చెప్పాను. మీడియాలో పదేపదే నన్ను ఐష్‌తో పోలుస్తూనే ఉన్నారు. దాని గురించే చెప్తూ నన్ను క్షమించండి, దయచేసి నన్ను ద్వేషించకండి అన్నాను. మరి ఆమె దాన్ని ఎలా తీసుకుందో నాకు తెలీదు అని స్నేహా ఉల్లాల్ పేర్కొంది.

## కుటుంబంతో ఉస్తాద్ సినిమాకు మెగాస్టార్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా తెరకెక్కిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం మార్చ్ 19న విడుదలైంది. ఈ చిత్రానికి పరవాలేదు అనే స్థాయి టాక్ దక్కినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమాకు మంచి కలెక్షన్లు వస్తున్నాయి. తాజాగా ఈ సినిమాను మూవీ బృందంతో కలిసి మెగాస్టార్ చిరంజీవి మరియు ఆయన సతీమణి సురేఖ ప్రత్యేక షోలో వీక్షించారు. మూవీ మేకర్స్ ఏర్పాటు చేసిన ఈ ప్రత్యేక ప్రదర్శనకు పవన్ కళ్యాణ్, ఆయన భార్య అన్నా లెజినోవా, ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన శ్రీలీల, దర్శకుడు హరీష్ శంకర్, నిర్మాతలు నవీన్, రవి, దర్శకుడు అనిల్ రావిపూడి తదితర సెలబ్రిటీలు కూడా హాజరయ్యారు. సినిమా చూస్తున్న సమయంలో సెలబ్రిటీలు ఇచ్చిన రియాక్షన్స్‌ను క్యాప్చర్ చేసి మూవీ మేకర్స్ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇప్పటికే పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో కొన్ని సంవత్సరాల క్రితం వచ్చిన 'గబ్బర్ సింగ్' చిత్రం భారీ విజయాన్ని అందుకుంది. దీంతో మొదటి నుంచే 'ఉస్తాద్ భగత్ సింగ్'పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మరి టోటల్ రన్ పూర్తయ్యేసరికి ఈ చిత్రం ఎన్ని వసూళ్లు సాధించి ఏ స్థాయి విజయాన్ని అందుకుంటుందో చూడాలి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించగా, తమన్ నేపథ్య సంగీతాన్ని సమకూర్చారు.






## సినిమాలు మానేయాలనుకున్నా

హిట్టు పడితే యాక్టర్స్‌ను నెత్తిన పెట్టుకునే జనాలు ఫ్లాప్ రాగానే వారిని దారుణంగా విమర్శిస్తుంటారు. ముఖ్యంగా హీరోహీరోయిన్లపై ఈ ట్రోలింగ్ తీవ్రస్థాయిలో ఉంటుంది. కథానాయికలనైతే రెండు మూడు ఫ్లాపులు రాగానే ఐరన్ లెగ్ అని ముద్రవేస్తారు. తనకు మరో మూవీ ఛాన్స్ వచ్చిందనగానే అయితే అది ఫ్లాప్ అవడం ఖాయం అని దారుణంగా మాట్లాడుతుంటారు. ఇలాంటి ట్రోలింగ్‌ను కొన్నేళ్లుగా చవిచూస్తోంది శ్రీలీల. మాస్ జాతర, రాబిన్ హుడ్, ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్, ఆదికేశవ, స్కంద.. ఇలా తను చేసిన సినిమాలన్నీ బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డాయి. తమిళంలో చేసిన పరాశక్తి కూడా లాభాలు తెచ్చిపెట్టలేదు. ఇప్పుడు వచ్చిన ఉస్తాద్ భగత్ సింగ్ కూడా తనను ఈ ఫ్లాప్ ట్యాగ్ నుంచి గట్టెక్కించలేకపోయింది. అయితే ఈ ట్రోలింగ్ భరించలేక ఎప్పుడో సినిమాలు మానేయాలనుకుందట. తాజాగా ఓ ఇంటర్వ్యూలో శ్రీలీల మాట్లాడుతూ.. కెరీర్ ప్రారంభంలోనే ఈ ట్రోల్స్‌కు విపరీతంగా భయపడ్డాను, బాధపడ్డాను, ఏడ్చేశాను. అమ్మా.. ఇదంతా నావల్ల అవుతుందా? కాలేజీకి తిరిగెళ్లిపోనా? అని అడిగాను.

## వయసు ఎక్కువైపోయిందా?



హీరోయిన్ రాశీ ఖన్నా ఏజ్ కోసం ఇప్పుడు సోషల్ మీడియాలో జోరుగా చర్చ సాగుతోంది. ఆమె నటించిన లేటెస్ట్ మూవీ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు బయటకు రావడంతో అభిమానుల్లో మిక్స్డ్ రెస్పాన్సులు వస్తున్నాయి. ముఖ్యంగా క్లోజప్ షాట్లలో రాశీ లుక్ పై కొంతమంది ఫ్యాన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సినిమాలో ఆమె ఉన్న కొన్ని షాట్లలో కాస్త వయసు ఎక్కువగా అనిపిస్తుందని పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. నిజానికి రాశీ ఖన్నా వయసు ఇప్పటికీ 35 సంవత్సరాలే అయినప్పటికీ, కెమెరా యాంగిల్స్, లైటింగ్ లేదా మేకప్ కారణంగా ఆమె లుక్ అంతగా ఆకట్టుకోలేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. దీంతో సోషల్ మీడియాలో ఆ అంశంపై చర్చ నడుస్తోంది.

## ఒళ్లు హూనం అవుతుంది: భూమి పెడ్నేకర్

ఇండస్ట్రీలో నిలబడాలి అంటే శారీరకంగా ఎన్నో మార్పులు చేసుకోవాలి అంటుంది బాలీవుడ్ నటి భూమి పెడ్నేకర్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె.. సినీ కెరీర్ గురించి ఎన్నో విషయాలు పంచుకుంది. 'దశాబ్ద కాలంగా చిత్రపరిశ్రమలో నా ప్రయాణం సాగుతోంది. పాత్రల కోసం ఎన్నో శారీకర మార్పులు చేసుకోవాల్సి వచ్చింది. దీని వల్ల చాలా ప్రాబ్లమ్స్ ఫేస్ చేశాను. ఇలా ఏ నటి కూడా చేయలేదేమో. అలాగే నా కెరీర్‌లోనే 'ది లేడీ కిల్లర్' చిత్ర వైఫల్యం వ్యక్తిగతంగా, వృత్తిపరంగా నన్ను తీవ్రంగా దెబ్బతీసింది. ఇక నా పనైపోయిందనుకున్న. మొదట నాకు ఇచ్చిన స్క్రిప్ట్‌లో నా పాత్ర పరిపూర్ణంగానే ఉంది. కానీ అందులో చాలా భాగాల్ని తెరకెక్కించలేదు. అసంపూర్తిగా సినిమాను విడుదల చేశారు. ఇది నాకు ముందే తెలిసుంటే బాగుండేది. నేను కూడా మేకింగ్‌లో భాగమై ఉంటే కొన్ని విషయాల్ని మార్చగలిగేదాన్ని.



## మల్టీస్టారర్‌లో కయాదు లోహార్

టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తనదైన మార్క్ ఎంటర్టైన్మెంట్ కోసం మరో భారీ మల్టీస్టారర్ సిద్ధం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో హీరోలుగా విక్టరీ వెంకటేష్..నందమూరి కల్యాణ్ రామ్ నటిస్తున్నారు. ఇద్దరు చేతులు కలపడం ఇదే తొలిసారి కావడంతో ఆ కాంబినేషన్ లో సినిమా ఎలా ఉంటుందని సర్వత్రా ఆసక్తి నెలకొంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అనీల్ కథతో పాటు ఆ కథలో పాత్ర ధారులపై దృష్టి పెట్టాడు. ఇప్పటికే వెంకటేష్‌కు జోడీగా అభినేత్రి కీర్తి సురేష్ పేరును దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. కల్యాణ్ రామ్ సరసన ఛాన్స్ అందుకునే నటి ఎవరు? అన్నది ఆసక్తికరంగా మారిన తరుణంలో కయాదు లోహార్ పేరును పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కళ్యాణ్ రామ్ గంభీరమైన పాత్రకు ఈమె పాత్ర చక్కగా సెట్ అవుతుందని అనీల్ బలంగా నమ్ముతున్నాడుట. ప్రస్తుతం కయాదు లోహార్ పేరు చర్చల దశలోనే ఉంది. కానీ ఖరారు అవ్వడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని సోర్సెస్ ద్వారా తెలిసింది.





# 20.88 సెకన్లలో 50 మీటర్లు

## కామెరాన్ కొత్త ప్రపంచ రికార్డు

చైనా స్విమ్మింగ్ ఓపెన్‌లో ఆస్ట్రేలియా యువ స్విమ్మర్ కామెరాన్ మెక్ఎవాయ్ సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. శనివారం జరిగిన పురుషుల 50మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో కామెరాన్ 20.88 సెకన్లలోనే పూర్తి చేశాడు. తద్వారా 17 ఏండ్లుగా బ్రెజిల్ స్విమ్మర్ సెజార్ సియోలో(20.91సె) పేరిట ఉన్న వరల్డ్ రికార్డును తాజాగా కామెరాన్ తుడిచిపెట్టాడు. అయితే 2009లో సూపర్ సూట్ ఎరాగా పేరొందిన సమయంలో సెజార్‌తో పాటు పలువురు స్విమ్మర్లు 150కి పైగా ప్రపంచ రికార్డులు నెలకొల్పారు. ఈ సూట్లకు నీటిపై తేలియాడే లక్షణంతో పాటు అదనపు ప్రయోజనాలు ఉన్నాయన్న కారణంతో వీటిపై నిషేధం విధించారు. తన ప్రపంచ రికార్డుపై కామెరాన్ స్పందిస్తూ 'పోటీకి ముందు నా వ్యక్తిగత ప్రదర్శన(21.06సె) అధిగమిస్తానన్న నమ్మకం నాకుంది. తొలుత 20.99 సెకన్లు అయినా చేరుకుంటా అనుకున్నా..కానీ 20.88 సెకన్లలో పూర్తి చేయడం నమ్మలేకపోతున్నా' అని అన్నాడు. తన రికార్డును తిరగరాసిన కామెరాన్‌ను సియోల్ ప్రత్యేకంగా అభినందిస్తూ ట్వీట్ చేశాడు.



## ఆకాశమే హద్దుగా రఘువంశీ బాదుడు


ఐపీఎల్ 2026 సీజన్ కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) తమ సన్నాహకాలను ప్రారంభించింది. గత సీజన్‌లో దారుణంగా విఫలమైన కేకేఆర్.. ఈ సారి ఎలాగైనా మెరుగైన ప్రదర్శన చేయాలనే పట్టుదలతో ఉంది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో తమ ట్రైనింగ్ క్యాంపును కేకేఆర్ ఏర్పాటు చేసింది. ఈ సన్నాహకాల్లో భాగంగా కేకేఆర్ శుక్రవారం ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్ ఆడింది. జట్టు సభ్యులు రెండు జట్లుగా విడిపోయి తలపడ్డారు. అయితే ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌లో రహానే జట్టుకు ప్రాతినిథ్యం వహించిన యువ ప్లేయర్ అంగ్‌క్రిష్ రఘువంశీ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 55 బంతుల్లోనే 9 ఫోర్లు, 5 సిక్సర్లతో 103 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు ప్రత్యర్థి జట్లకు తన బ్యాటింగ్‌తో వార్నింగ్ ఇచ్చాడు. 200 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో రఘువంశీ చెలరేగడంతో రహానే టీమ్ 19.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. రఘువంశీతో పాటు న్యూజిలాండ్ స్టార్ ఫిన్ అలెన్ కూడా దూకుడుగా ఆడాడు. అయితే ఈ సీజన్‌లో రఘువంశీ బ్యాటింగ్ ఆర్డర్‌పై ఇంకా క్లారిటీ లేదు. గత సీజన్‌లో కొన్ని సార్లు మూడో స్థానంలో.. మరికొన్ని సార్లు మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు వచ్చిన రఘు వంశీ.. ఈ సారి ఏ స్థానంలో ఆడుతాడో చూడాలి. ఫిన్ అలెన్, టీమ్ సీఫెర్ట్, సునీల్ నరైన్, అజింక్యా రహానే, కామెరూన్ గ్రీన్ వంటి టాపార్డర్ బ్యాటర్లు ఉండటంతో రఘువంశీని ఏ స్థానంలో ఆడిస్తారు అనేదానిపై క్లారిటీ లేదు. ఈ ఏడాది సీజన్‌లో కేకేఆర్ తమ తొలి మ్యాచ్‌లో మార్చి 29న వాంఖడే స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. కేకేఆర్ ప్రధాన పేసర్ హర్షిత్ రాణా గాయంతో ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు.

## 15 ఏళ్ల వయసులోనే సెంచరీ

### చరిత్ర సృష్టించిన రువాండా ప్లేయర్



రువాండా టీనేజ్ సెన్సేషన్, 15 ఏళ్ల ఫ్యానీ ఉటాగుషి మానిండే చరిత్ర సృష్టించింది. అంతర్జాతీయ టీ20ల్లో అరంగేట్ర మ్యాచ్‌లోనే సెంచరీ బాదిన తొలి ప్లేయర్‌గా వరల్డ్ రికార్డ్ నమోదు చేసింది. నైజీరియాలోని లాగోస్ వేదికగా జరుగుతున్న మహిళల టీ20 ఇన్విటేషనల్ సిరీస్‌లో ఫ్యానీ ఉటాగుషి ఈ ఫీట్ సాధించింది. ఘనాతో శుక్రవారం జరిగిన మ్యాచ్‌తో అంతర్జాతీయ టీ20ల్లోకి అరంగేట్రం చేసిన ఫ్యానీ ఉటాగుషి.. 65 బంతుల్లో 17 ఫోర్లతో 111 పరుగులు చేసింది. మహిళల టీ20 చరిత్రలోనే తన అరంగేట్రం మ్యాచ్‌లోనే సెంచరీ సాధించిన తొలి క్రీడాకారిణిగా ఆమె చరిత్ర సృష్టించింది. ఈ క్రమంలో ఆస్ట్రేలియా ప్లేయర్ కరెన్ రోల్టన్ పేరిట ఉన్న రికార్డును ఉటాగుషి అధిగమించింది. 2005లో కరెన్ రోల్టన్ ఇంగ్లండ్‌పై అరంగేట్ర మ్యాచ్‌లో 96 పరుగులు చేసింది. ఇప్పటి వరకు ఇదే రికార్డుగా ఉండగా.. ఫ్యానీ ఉటాగుషి చెరిపివేసింది. కేవలం 15 ఏళ్ల 223 రోజుల వయసులో సెంచరీ చేయడం ద్వారా, అంతర్జాతీయ టీ20 క్రికెట్ (పురుషులు, మహిళలు కలిపి) చరిత్రలోనే అతి చిన్న వయసులో ఈ ఘనత సాధించిన ప్లేయర్‌గా నిలిచింది. గతంలో ఉగాండాకు చెందిన ప్రోస్కోవియా అలకో (16 ఏళ్ల 233 రోజులు) పేరిట ఉన్న రికార్డును ఫ్యానీ బద్దలు కొట్టింది. పురుషుల క్రికెట్‌లో ఫ్రాన్స్‌కు చెందిన గుస్తావ్ మెక్కన్ 18 ఏళ్ల వయసులో సెంచరీ చేయడమే ఇప్పటివరకు రికార్డుగా ఉంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రువాండా జట్టు ఫ్యానీ విధ్వంసకర శతకంతో నిర్ణీత 20 ఓవర్లలో 210/3 భారీ స్కోరు చేసింది. ఫ్యానీతో పాటు గిసెల్ ఇషిమ్వే (14), క్లారిస్ ఉవాసే (15), మర్వెయిల్ ఉవాసే (32) రాణించారు. 210 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఘనా జట్టు 88/8కే పరిమితమైంది. దాంతో రువాండా 122 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. రువాండా బౌలింగ్‌లో బెలీస్ మురేకటేట్ 3 వికెట్లు తీసి ఘనా పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ఫ్యానీ ఉటాగుషిమానిండే అద్భుత ప్రదర్శనకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.



## సిరాజ్‌ను నమ్మలేం: కైఫ్



ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో గుజరాత్ టైటాన్స్ జట్టును విశ్లేషించిన మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ డెత్ బౌలింగ్ బలహీనంగా ఉందని చెప్పాడు. స్లాగ్ ఓవర్లలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసే బౌలర్ లేదని పేర్కొన్నాడు. కొత్త బంతితో మహమ్మద్ సిరాజ్ రాణించినా.. డెత్ ఓవర్లలో అతనిపై నమ్మకం ఉంచలేమని, గత సీజన్ చివరి మూడు మ్యాచ్‌ల్లో అతను ధారళంగా పరుగులిచ్చుకున్నాడని గుర్తు చేశాడు. అధికార బ్రాడ్‌కాస్టర్ స్టార్ స్పోర్ట్స్ షోలో గుజరాత్ టైటాన్స్ గురించి మాట్లాడిన కైఫ్.. డెత్ బౌలింగ్‌ను మెరుగుపర్చుకుంటే గుజరాత్ టైటాన్స్‌కు తిరుగుండదని తెలిపాడు. 'సిరాజ్ కొత్త బంతితో వికెట్లు తీసే బౌలర్. ప్రసిద్ధ్ కృష్ణ మిడిల్ ఓవర్లలో బౌలింగ్ చేస్తాడు. బంతిని బలంగా పిచ్ చేయడం అతని బలం. అహ్మదాబాద్ గ్రౌండ్ చాలా పెద్దది. స్క్వేర్ బౌండరీలు కూడా దూరంగా ఉంటాయి. ప్రసిధ్ కృష్ణ మిడిల్ ఓవర్లలో హార్డ్ లెంగ్స్ వేస్తాడు. కాబట్టి జట్టులో అతని పాత్ర ఏంటో నాకు అర్థమవుతోంది'అని కైఫ్ అభిప్రాయపడ్డాడు.

## యశ్ దయాల్‌పై ఆర్సీబీ వేటు?



ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. మైనర్ బాలికపై అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న తమ లెఫ్టార్మ్ పేసర్ యశ్ దయాల్‌పై వేటు వేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వ్యవహారంపై రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ అతన్ని జట్టుకు దూరంగా ఉంచారనే విషయం మాత్రం స్పష్టమవుతోంది. అప్‌కమింగ్ ఐపీఎల్ 2026 సీజన్‌కు ఇంకా వారం రోజుల సమయం మాత్రమే ఉండగా.. యశ్ దయాల్ ఇంకా ఆర్‌సీబీ ప్రాక్టీస్ క్యాంప్‌లో పాల్గొనలేదు. టీమ్ బస్సుపై కూడా యశ్ దయాల్ మినహా జట్టులోని ఆటగాళ్లందరి ఫొటోలు ఉండటం ఈ వార్తలకు బలం చేకూరుస్తోంది.

## ఆ ఇద్దరే సీఎస్‌కే మ్యాచ్ విన్నర్లు: చావ్లా

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్(సీఎస్‌కే) మెరుగైన ప్రదర్శన చేస్తుందని మాజీ క్రికెటర్ పియూష్ చావ్లా అంచనా వేసాడు. బ్యాటింగ్ ఆల్‌రౌండర్ శివమ్ దూబే, యువ ప్లేయర్ ఆయుష్ మాత్రేలతో చెన్నై సూపర్ కింగ్స్ స్వరూపం మారిపోయిందని అభిప్రాయపడ్డాడు. ఈ ఇద్దరూ సీఎస్‌కే మ్యాచ్ విన్నర్లు అని కొనియాడాడు.



ఐపీఎల్ 2026 వేలానికి ముందు సీఎస్‌కే రిటైన్ చేసుకున్న ఆటగాళ్లలో శివమ్ దూబే ఒకడు. ఈ బ్యాటింగ్ ఆల్‌రౌండర్‌పై నమ్మకం ఉంచిన సీఎస్‌కే మేనేజ్‌మెంట్ వరుసగా అతన్ని అంటిపెట్టుకుంటుంది. ఇటీవల ముగిసిన ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లోనూ శివమ్ దూబే మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శనలు చేశాడు. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న అతను ఐపీఎల్ 2026 సీజన్‌లోనూ అదే జోరు కొనసాగిస్తాడని పీయూష్ చావ్లా జోస్యం చెప్పాడు.

## పీసీబీ అతి జోక్యం: కిర్‌స్టెన్

మోహసిన్ నఖ్వీ సారథ్యంలోని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) అతి జోక్యంతోనే హెడ్ కోచ్ పదవికి రాజీనామా చేశానని గ్యారీ కిర్‌స్టెన్ తెలిపాడు. కోచ్‌గా తనకు స్వేచ్ఛ ఇవ్వలేదని ఆరోపించాడు. రెండేళ్ల క్రితం(2024) పాకిస్థాన్ పరిమిత ఓవర్ల కోచ్‌గా రెండేళ్ల ఒప్పందంతో గ్యారీ కిర్‌స్టన్ బాధ్యతలు చేపట్టాడు. కానీ 6 నెలల వ్యవధిలోనే తన కోచ్ పదవికి రాజీనామా చేశాడు. ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్ ప్రారంభానికి కేవలం 6 రోజుల ముందు కోచ్ పదవి బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. కిర్‌స్టెన్ స్థానంలో జేసన్ గిలెస్పీ తాత్కలిక కోచ్‌గా బాధ్యతలు చేపట్టాడు. కానీ అతను కూడా కొద్ది నెలల్లోనే రాజీనామా చేయడంతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. తాజాగా ఓ క్రీడా ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన రాజీనామాకు గల కారణాలను కిరస్టన్ వెల్లడించాడు. పీసీబీపై నిప్పులు చెరిగాడు. 'నేను నా కెరీర్‌లో ఎక్కడా చూడని విధంగా పాక్ క్రికెట్ బోర్డు జట్టు అంతర్గత విషయాల్లో జోక్యం చేసుకుంటుంది. బయటి వ్యక్తుల ఒత్తిడి మధ్య ఆటగాళ్లతో కలిసి పని చేయడం ఒక కోచ్‌కి నరకంలా ఉంటుంది. జట్టు ఓడిపోయిన ప్రతిసారీ ప్లానింగ్‌లో లోపాలను వెతకకుండా.. కోచ్‌లను బాధ్యులను చేసి వారిని తొలగించడం లేదా కఠినమైన ఆంక్షలు విధించడం పీసీబీకి అలవాటుగా మారింది. జట్టు పేలవ ప్రదర్శనకు కోచ్‌లను బాధ్యులను చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరదు. కోచ్‌లకు కనీస గౌరవం, నిర్ణయాధికారం లేని అస్థిరమైన వాతావరణం వల్లనే నేను కోచ్ పదవికి రాజీనామా చేశాను. ఆస్ట్రేలియా పర్యటనకు ముందే తప్పుకున్నాను.'అని కిరస్టన్ చెప్పుకొచ్చాడు.



## లైవ్‌లో నోరు జారిన బ్రావో



కోల్‌కతా నైట్‌రైడర్స్(కేకేఆర్) మెంటార్, వెస్టిండీస్ దిగ్గజం డ్వేన్ బ్రావో చిక్కుల్లో పడ్డాడు. లైవ్‌లో ఉన్నామనే సోయిలేకుండా మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశాడు. అమ్మాయిలను కోడిపిల్లలుగా సంబోదిస్తూ అతను చేసిన అసభ్యకరమైన వ్యాఖ్యలు నెట్టింట తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కాగా.. నెటిజన్లు బ్రావోపై మండిపడుతున్నారు. ఐపీఎల్ 2026 సీజన్ నేపథ్యంలో శుక్రవారం కేకేఆర్ నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమావేశంలో కెప్టెన్ అజింక్యా రహానే, అసిస్టెంట్ కోచ్ షేన్ వాట్సన్, హెడ్ కోచ్ అభిషేక్ నాయర్‌లతో పాటు మెంటార్ బ్రావో పాల్గొన్నారు. అయితే, ప్రెస్‌మీట్ అధికారికంగా ప్రారంభం కావడానికి ముందే.. మైకులు ఆన్ చేసి ఉన్నాయనే విషయం గమనించకుండా బ్రావో తన సహచరులతో సరదాగా మాట్లాడాడు. తన పక్కనే ఉన్న షేన్ వాట్సన్‌తో మాట్లాడుతూ.. 'నేను ఇంటి దగ్గర రెండు చిక్స్‌తో(ఇద్దరు అమ్మాయిలతో) ఉన్నప్పుడు వీళ్లు(ప్రెస్ మీట్‌కు రావాలని) నాకు ఫోన్ చేశారు' అని అన్నాడు. బ్రావో నోరు జారడాన్ని గమనించిన రహానే.. మైక్‌లు ఆన్‌లో ఉన్నాయని, లైవ్‌లో ఉన్నామని అతన్ని అప్రమత్తం చేశాడు.

ఈవార్తలు
# ప్రజావాణి

www.evarthalu.com

నేటి ఈవార్తలు

ఆదివారం 22-3-2026, జగిత్యాల

శ్రావణ వాణి

ఎవడిది ఈ భారతం..
ఎవడిది ఈ ఉపఖండం..
ఒకడు మదరాసీ అండటు..
ఇంకొకడు మార్వాడీ అంటడు..
ఒకడు తురకోడు అంటడు..
ఇంకొకడు బాపనోడు అంటడు..
ముఖం మారితే చైనీస్ అంటడు..
నల్లగా ఉంటే ఆఫ్రికన్ అంటడు..
కులం వేరైతే చిన్నచూపు చూస్తడు..
మతం ఇంకోటైతే దూరం పెడ్తడు..
మతాల మౌఢ్యంలో మనిషి మరణం..
కులపు మురికిలో ఆత్మగౌరవ ఖననం..

# ఎవడిది ఈ భారతం?

"ఎవడిది ఈ భారతం..? ఈ ప్రశ్న ఇవాళ ప్రతి భారతీయుడి అంతరాత్మను తట్టి లేపాల్సింది. వైవిధ్యంలో ఏకత్వం అని మనం వల్లించే సూక్తులు, ఆచరణలోకి వచ్చేసరికి అగాథాలవుతున్నాయి. ఒకే గడ్డపై పుట్టి, ఒకే గాలిని పీలుస్తూ, ఒకే జెండా నీడన బతుకుతున్నా.. మన మధ్య గీసుకున్న అదృశ్య రేఖలు చెరిగిపోవడం లేదు, సదా పెరుగుతూనే ఉన్నాయి. దక్షిణాది వాడిని 'మదరాసీ' అని, ఉత్తరాది వాడిని 'మార్వాడీ' అని ముద్ర వేసి ఒకరినొకరు వెక్కిరించుకోవడం ఇంకెన్నాళ్లు? ముఖం కాస్త వేరుగా ఉంటే సొంత దేశస్థుడినే 'చైనీస్' అని వెలివేయడం, చర్మం నలుపుగా ఉంటే 'ఆఫ్రికన్' అని ఈసడించుకోవడం మన అనాగరికతకు నిదర్శనం. కులం పేరుతో కంచెలు వేసుకుని, మతం పేరుతో గోడలు కట్టుకుని మనిషిని మనిషిగా చూడలేని స్థితికి దిగజారిపోతున్నాం."



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్ 9581291919

తురకోడు, బాపనోడు, దళితుడు.. ఇలాంటి విభజన పదజాలం మనల్ని సంకుచితత్వంలోకి నెట్టేస్తోంది. పొరుగు దేశాల నుంచి వచ్చే ముప్పు కంటే, మన లోలోపల రగులుతున్న ఈ విద్వేష జ్వాలలే అత్యంత ప్రమాదకరమైనవి. వేల ఏళ్ల నాగరికత ఉన్న ఈ ఉపఖండంలో, మనిషి రంగును బట్టి, ప్రాంతాన్ని బట్టి, పూజించే దేవుడిని బట్టి మనిషిని అంచనా వేయడం మన ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. మనవాడైనా సరే.. కులం కుదరకపోతే పరాయివాడిలా చూసే మనస్తత్వం మారాలి. భారత రాజ్యాంగం మనకు కల్పించిన పౌరసత్వం కంటే, మనం తగిలించుకున్న సామాజిక ముద్రలే గొప్పవని భావించడం ఆత్మవంచనే అవుతుంది. ఈ దేశం ఎవరిదో కాదు.. ఇక్కడ పుట్టిన ప్రతి బిడ్డది. ఈ ఉపఖండం ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితం కాదు. మనిషిని మనిషిగా గౌరవించడం నేర్చుకున్నప్పుడే.. 'మనోడైనా పరాయివాడే' అనే బాధాకరమైన మాట వినిపించదు. అప్పుడే నిజమైన భారతం ఆవిష్కృతమవుతుంది.

## ఒక ప్రశ్న.. వెయ్యి ఆవేదనలు

సింధు నాగరికత నుంచి గంగా యమునా తెహజీబ్ వరకు, వేల ఏళ్ల ప్రయాణంలో మనం ఎన్నో సామ్రాజ్యాలను చూశాం, ఎన్నో దండయాత్రలను తట్టుకున్నాం. కానీ, ఇవాళ మనం ఎదుర్కొంటున్న ముప్పు బయటి శత్రువుల నుండి కాదు; మన లోలోపల పేరుకుపోయిన 'ముద్రల' నుంచి. భారతదేశం అంటేనే రాష్ట్రాల కలయిక. కానీ, ఈ భౌగోళిక వైవిధ్యం ఇవాళ వెక్కిరింతలకు వేదికైంది. దక్షిణాది వాడు అంటే 'మదరాసీ' అనే ఒకే ఒక్క ముద్ర వేసి, అతని భాషను, సంస్కృతిని తక్కువ చేసి చూసే ధోరణి ఉత్తరాదిన ఉంటే; వ్యాపారం కోసం వచ్చే ప్రతి ఉత్తరాది వాడిని 'మార్వాడీ' అని పిలుస్తూ వెలివేసే తత్వం దక్షిణాదిన కనిపిస్తోంది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడింది పరిపాలన సౌలభ్యం కోసమే కానీ, మనుషుల మధ్య గోడలు కట్టడానికి కాదు. ఈశాన్య భారతీయులు మన దేశ అంతర్భాగమే అయినా, వారి కళ్ల తీరును బట్టి వారిని 'పరాయి దేశస్థులు'గా చూడటం మన అజ్ఞానానికి పరాకాష్ఠ. అలాగే, చర్మం రంగును బట్టి మనిషి స్థాయిని నిర్ణయించే 'నలుపు-తెలుపు' వివక్ష మన రక్తంలో ఇంకా ప్రవహిస్తూనే ఉంది. ఇది కేవలం బాహ్య రూపం మీద దాడి కాదు, ఒక మనిషి ఆత్మగౌరవం మీద జరుగుతున్న దాడి. ఒకే దేశస్థుడైనా, ఒకే ప్రాంతం వాడైనా.. ఏదో ఒక కారణం వెతికి అతడిని దూరం పెట్టడం. ఈ 'పరాయికరణ' అనేది సమాజపు పునాదులను బలహీనపరుస్తుంది. మనిషి తన సొంత గడ్డ మీద తను 'బయటివాడిని' అనే భావనతో బతకడం కంటే పెద్ద నరకం మరొకటి ఉండదు. ఈ విభజనల వెనుక సామాజిక కారణాల కంటే రాజకీయ కారణాలే ఎక్కువ.

## ప్రాంతీయ వివక్ష

భారతదేశం విభిన్న సంస్కృతులు, భాషలు మరియు ఆచారాల సమ్మేళనం. 'భిన్నత్వంలో ఏకత్వం' మన దేశ పునాది. అయితే, ఇటీవలి కాలంలో ఉత్తరాది రాష్ట్రాలలో దక్షిణ భారత ప్రజల పట్ల కనిపిస్తున్న కొన్ని వివక్షాపూరిత ధోరణులు, తక్కువ చేసి చూసే భావజాలం ఆందోళన కలిగిస్తోంది. ఇది కేవలం ఒక ప్రాంతానికి సంబంధించిన సమస్య కాదు, దేశ సమగ్రతకే సవాలు. ముఖ్యంగా భాష, ఆహారపు అలవాట్లు, మరియు శారీరక ఛాయ ఆధారంగా దక్షిణ భారతీయులను తక్కువ స్థాయి వ్యక్తులుగానో చూడటం శోచనీయం. హిందీ మాట్లాడలేకపోవడాన్ని ఒక లోపంగా పరిగణించడం, మద్రాసీ అనే పదాన్ని ఎగతాళిగా వాడటం వంటివి దక్షిణ భారత ప్రజలలో ఆత్మన్యూనతాభావాన్ని పెంచుతున్నాయి. వాస్తవానికి, దేశ ఆర్థికాభివృద్ధిలో దక్షిణ రాష్ట్రాల పాత్ర అద్వితీయం. ఐటీ రంగం, శాస్త్ర సాంకేతిక రంగాలు, విద్య, తలసరి ఆదాయంలో దక్షిణ రాష్ట్రాలు అగ్రగామిగా ఉన్నాయి. దేశ ఖజానాకు అత్యధికంగా పన్నులు చెల్లిస్తున్నది కూడా ఈ ప్రాంతాలే. అక్షరాస్యతలోనూ, సామాజిక స్పృహలోనూ దక్షిణాది ఎంతో ముందుంది. ఇంతటి ఘనమైన చరిత్ర, పురోగామి భావాలు కలిగిన ప్రజలను చిన్నచూపు చూడటం అంటే దక్షిణాది ప్రతిభను, శ్రమను అవమానించడమే. ఒక ప్రాంతం అభివృద్ధి చెందితే అది దేశం గర్వించదగ్గ విషయం కావాలి కానీ, ఆ అభివృద్ధిని ఆ ప్రాంతానికి శిక్షగా మార్చడం అన్యాయం. త్వరలో జరగబోయే నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు పెనుముప్పుగా మారింది. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసినందుకు దక్షిణ రాష్ట్రాల ఎంపీ సీట్లు తగ్గి, జనాభా పెరిగిన ఉత్తరాది రాష్ట్రాల సీట్లు పెరిగే అవకాశం ఉంది. ఇది పార్లమెంటులో దక్షిణ రాష్ట్రాల గళాన్ని నొక్కివేసే ప్రయత్నమే. దక్షిణాది రాష్ట్రాలు దేశ ఖజానాకు భారీగా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ, తిరిగి రాష్ట్రాలకు అందే వాటాలో కోత విధిస్తున్నారు. ఉదాహరణకు, కేరళ వంటి రాష్ట్రాలు ప్రతి రూ.100 పన్నుకు కేవలం రూ.21 మాత్రమే తిరిగి పొందుతుంటే, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాలు అంతకంటే ఎక్కువ పొందుతున్నాయి. దీనినే 'సౌత్ టాక్స్ మూమెంట్' అని అనాల్సి వస్తోంది. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం 'హిందీ'ని ఏకైక అనుసంధాన భాషగా మార్చే ప్రయత్నం చేస్తుండటం దక్షిణాది రాష్ట్రాల సాంస్కృతిక అస్తిత్వానికి సవాలుగా మారింది.


> "ఒకే జెండా నీడన.. ఒకే రాజ్యాంగం సాక్షిగా.. మనం భారతీయులం అని ప్రతిజ్ఞ చేస్తున్నాం. కానీ వీధి చివర కులం అడుతున్నారు, ముఖం చూసి ప్రాంతం అడుగుతున్నారు, రంగు చూసి దేశం అడుగుతున్నారు. మన మధ్య ఉన్నది 'వైవిధ్యం' అనుకున్నాం.. కానీ అది 'విద్వేషం'గా మారుతోంది. ఆత్మీయుడైన 'మనోడు' కూడా ఇవాళ ఎందుకు 'పరాయివాడు' అయిపోతున్నాడు? ఈ చీలిక ఎవరి కోసం? ఈ విచ్ఛిన్నం ఎవరి లాభం కోసం? మనల్ని మనం ప్రశ్నించుకోవాల్సిన సమయం ఇది!"
>
> "భారతదేశం నా మాతృభూమి.. భారతీయులందరూ నా సహోదరులు అని ప్రతిరోజూ పాఠశాలల్లో ప్రతిజ్ఞ చేస్తున్నాం. కానీ, తరగతి గది దాటాక ఆ సహోదరభావం ఏమైపోతోంది? మనుషుల మధ్య దూరాన్ని పెంచే కుల పిచ్చి, మత మౌఢ్యం, ప్రాంతీయ అహంకారం అనే ముసుగులను తొలగించి చూడాలి. మనోడైనా పరాయివాడే అనే నిస్సహాయ స్థితి నుంచి, ఎవరైనా నా వాడే అనే ఉన్నత స్థితికి సమాజం ఎదిగినప్పుడే ఈ భారతం అందరిది అవుతుంది!"

## డిజిటల్ విద్వేషం

ఓట్ల వేటలో రాజకీయ శక్తులు ప్రజల మధ్య మనోడు-పరాయివాడు అనే విషబీజాలను నాటుతున్నాయి. దీనికి తోడు సోషల్ మీడియా వేదికగా సాగుతున్న డిజిటల్ విద్వేషం అగ్నికి ఆజ్యం పోస్తోంది. ప్రాంతం, కులం, ఆహారపు అలవాట్లపై జరుగుతున్న ఈ దాడులు ప్రజాస్వామ్య పునాదులనే కదిలిస్తున్నాయి. పొరుగు దేశాల నుంచి వచ్చే ముప్పు కంటే, మన లోలోపల రగులుతున్న ఈ విభజన జ్వాలలే అత్యంత ప్రమాదకరమైనవి. విద్వేషపు గోడలను కూల్చి, మానవత్వపు వంతెనలను నిర్మించాల్సిన బాధ్యత నేటి పౌర సమాజంపై ఉంది. ఆ దిశగా అడుగులు పడకపోతే, మనం నిర్మించుకున్న ఈ ఆధునిక భారతం అంతర్గత కలహాలకే బలైపోయే ప్రమాదం ఉంది. చదువు కేవలం ఉద్యోగం కోసమే కాకుండా, సంస్కారం కోసం ఉండాలి. పిల్లలకు చిన్నప్పటి నుంచే 'భారతీయత' అంటే ఏమిటో నేర్పాలి. మనిషిని మనిషిగా ప్రేమించడం, అతని ప్రాంతం లేదా కులం కంటే అతని వ్యక్తిత్వాన్ని గౌరవించడం నేర్చుకోవాలి. చట్టాలు వివక్షను ఆపగలవేమో కానీ, మనసుల్లోని మాలిన్యాన్ని కడగలేవు. అది సామాజిక చైతన్యం ద్వారానే సాధ్యం. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు, కచ్ నుంచి కామరూప వరకు.. అందరి రక్తం ఎర్రదే. మనం గీసుకున్న ఈ కృత్రిమ గీతలు రేపు మన పిల్లల భవిష్యత్తును దహించకముందే మేల్కోవాలి.

## విషపూరిత వివక్ష

- ఈశాన్య రాష్ట్రాల ప్రజలు వారి శారీరక ఆకృతి, విభిన్న సంస్కృతి కారణంగా తరచుగా జాతి వివక్షకు గురవుతున్నారు.
- వారిని చింకీ అని పిలవడం లేదా చైనా, నేపాల్ దేశస్థులుగా పరిగణించడం వంటి అవమానాలు జరుగుతున్నాయి.
- ఢిల్లీ వంటి నగరాల్లో ఈశాన్య విద్యార్థులపై భౌతిక దాడులు జరిగిన సందర్భాలు ఉన్నాయి. (ఉదాహరణకు 2014లో జరిగిన నిడో తానియా కేసు).
- ఈశాన్య రాష్ట్రాల వారి ఆహారపు అలవాట్లు (ఉదా: మోమోస్ అమ్మేవారిగా ముద్ర వేయడం), వస్త్రధారణను ఎగతాళి చేయడం జరుగుతోంది.
- కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో ఈశాన్య భారతీయులను కరోనా అని పిలవడం, దుకాణాల్లోకి రానివ్వకపోవడం వంటి తీవ్ర వివక్ష ఎదురైంది.
- హిందీ రాని దక్షిణాది వారిని చిన్నచూపు చూడటం లేదా దక్షిణాది భాషలన్నింటినీ కలిపి మదరాసీ అని సంబోధించడం వంటివి ఇప్పటికీ జరుగుతున్నాయి.
- దక్షిణాది వారు నల్లగా ఉంటారనే మూస ధోరణితో వారిని తక్కువగా చూడటం, ఎగతాళి చేయడం వంటివి కనిపిస్తున్నాయి.
- బాలీవుడ్ సినిమాల్లో దక్షిణాది వారిని వింతగా మాట్లాడేవారిగా లేదా క్రూరమైన విలన్లుగా చిత్రీకరించడం వల్ల కూడా ఈ వివక్ష పెరుగుతోంది.




## రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.